




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 | సంచిక : 125 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | బుధవారం 8 జనవరి 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## కేటీఆర్ అరెస్టుకు లైన్ క్లియర్..!

### క్వాష్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు..

హాట్ టాపిక్‌గా మారిన ఫార్ములా ఈ కేసు




- ఫార్ములా ఈ కేసులో అరెస్టుపై స్టే ఎత్తివేత
- విచారణకు రావాలని ఏసీబీ నోటీసులు
- అదే రోజు అరెస్టు చేస్తారంటూ ఊహాగానాలు
- హాట్ టాపిక్ గా మారిన ఫార్ములా ఈ కేసు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫార్ములా ఈ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ అరెస్టుకు లైన్ క్లియర్ అయ్యింది. ఫార్ములా ఈ వ్యవహారంలో రూ. 55 కోట్లను అక్రమంగా విదేశీ సంస్థలకు బదలాయించారని పేర్కొంటూ హెచ్ఎండీఏ కమిషనర్ దాన కిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా అప్పటి హెచ్ఎండీఏ ప్రిన్సిపల్ సెక్రటరీ సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను, అదేవిధంగా హెచ్ఎండీఏ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని ఏసీబీ చేర్చింది. తనపై ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ను కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. గత నెల 31న ఇరువైపుల వాదనలు ముగించిన హైకోర్టు.. నేడు తీర్పు వెలువరించింది. ఏసీబీ తరపున అడ్వొకేట్

వివరాలు 2లో..




# నాంపల్లిలో ఉద్రిక్తత..
# బీజేపీ వర్సెస్ కాంగ్రెస్

- గాంధీభవన్ ముట్టడికి యత్నం
- ఫ్లెక్సీలు చించేసిన బీజేపీ కార్యకర్తలు
- లాఠీచార్జి చేసిన పోలీసులు.. పలువురి అరెస్ట్
- ప్రియాంకపై బీజేపీ నేత అనుచిత వ్యాఖ్యల ఎఫెక్ట్
- ఉదయం బీజేపీ ఆఫీసు వద్ద కాంగ్రెస్ ఆందోళన
- ఇరు పార్టీల కార్యకర్తల పరస్పర దాడులు

**హైదరాబాద్ పెన్ పవర్:**నాంపల్లిలో ఉద్రిక్తత కొనసాగుతోంది. వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఢిల్లీ బీజేపీ సీనియర్ నేత రమేశ్ బిదూరి చేసిన అనుచిత వ్యాఖ్యలు గొడవకు కారణమయ్యాయి. ఉదయం కాంగ్రెస్ కార్యకర్తలు నాంపల్లిలోని బీజేపీ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు వెళ్లారు. అక్కడ ఉన్న బీజేపీ కార్యకర్తలు ఎదురు దాడి చేశారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ ఆఫీసుపైకి రాళ్లు విసరడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బీజేపీ శ్రేణులు కర్రలతో కాంగ్రెస్ కార్యకర్తల వెంటపడ్డారు. ఈ ఘటనలో ఓ బీజేపీ కార్యకర్త తలకు గాయమైంది. పోలీసులు భారీగా మోహరించి ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టారు. తమ కార్యాలయంపై దాడిని నిరసిస్తూ బీజేపీ కార్యకర్తలు గాంధీభవన్ ముట్టడికి యత్నించారు. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీజేవైఎం కార్యకర్తలకు మధ్య వాగ్వాదం జరిగింది. పరిసరాల్లో కట్టిన ఫ్లెక్సీలను చించి నిరసన తెలిపారు. అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు.

**రమేశ్ బిధూరి ఏమన్నారంటే..?**

ఈ వివాదానికి ఢిల్లీ బీజేపీ సీనియర్ ఢిల్లీ బీజేపీ సీనియర్ నేత రమేష్ బిదూరి వయనాడ్ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రాపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ప్రస్తుత ముఖ్యమంత్రి అతిషిపై బీజేపీ తరపున

## కేటీఆర్ ను అరెస్ట్ చేస్తే చేస్కోనియ్యండి..



**హైదరాబాద్ పెన్ పవర్:**ఫార్ములా ఈ రేసు కేసులో.. కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటీషన్ ను హైకోర్టు కొట్టివేయటం.. విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంపై బీఆర్ఎస్ పార్టీ నేత, ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పుపై.. ఫుల్ బెంచ్ కు వెళ్లాలా లేక సుప్రీంకోర్టుకు వెళ్లాలా అనేది మా లాయర్లతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారాయన. హైకోర్టు ఆదేశాలతో ఏసీబీ, ఈడీ విచారణకు సహకరిస్తామని.. పారిపోయేది లేదని వెల్లడించారు హరీశ్ రావు. కక్షపూరితంగా.. డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే కేటీఆర్ పై కేసు పెట్టారంటూ విమర్శించారాయన. కేటీఆర్ ను అరెస్ట్

వివరాలు 2లో..

## బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే గాంధీభవన్ పునాదులు లేకుండా చేస్తారు

- బీజేపీ కార్యాలయంపై దాడిని ఖండించిన బండి సంజయ్
- రాళ్ల దాడులను కాంగ్రెస్ ప్రోత్సహించాలనుకుంటోందా? అని ప్రశ్న
- దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లోని బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనను కేంద్ర మంత్రి బండి సంజయ్ ఖండించారు. తమ కార్యాలయంపై దాడులు చేస్తుంటే బీజేపీ చూస్తూ ఊరుకోదని అన్నారు. బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే గాంధీభవన్ సహా కాంగ్రెస్ కార్యాలయాల పునాదులు కూడా

వివరాలు 2లో..

## ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు మేడారం మినీ జాతర



**హైదరాబాద్ పెన్ పవర్:**దక్షిణ కుంభమేళగా ప్రసిద్ధ గాంచిన మేడారం మినీ జాతర తేదీలు ఖారారు అయ్యాయి. 2025, ఫిబ్రవరి 12 నుంచి 15వ తేదీ వరకూ మేడారం మినీ జాతర జరగనుంది. మేడారం మినీ జాతర ఏర్పాట్లపై మంత్రి సీతక్క అధికారులతో మంగళవారం (డిసెంబర్ 7) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మీటింగ్‌కు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్, ఇతర అధికారులు, మేడారం పూజారులు హాజరయ్యారు. మేడారం మినీ జాతర తేదీ, ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం ఫిబ్రవరి 12 నుంచి 15వ వరకు మేడారం మినీ జాతర నిర్వహించాలని డిసైడ్ అయ్యారు. జాతరకు

వివరాలు 2లో..

### ఈవీఎం ట్యాంపరింగ్ జరుగుతోందనేది
## నిరాధార ఆరోపణ

- ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతోందని రాజకీయ పార్టీల ఆరోపణలు
- మీడియా ముందుకువచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్
- ఈవీఎంలపై సందేహాలు అక్కర్లేదని స్పష్టీకరణ

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈవీఎం ట్యాంపరింగ్ జరుగుతోందనేది నిరాధార ఆరోపణ అని స్పష్టం చేశారు. ఈవీఎంలు అత్యంత భద్రతతో కూడినవని, ఈవీఎంలపై సందేహాలు అక్కర్లేదని పేర్కొన్నారు. ర్యాండమ్ గా వీవీ ప్యాట్ లలోని స్లిప్పులను లెక్కిస్తున్నామని,




వివరాలు 2లో..

### హెచ్ఎంపీవీ వైరస్‌ను
## తేలిగ్గా తీసుకోవద్దు

- హెచ్ఎంపీవీని తేలిగ్గా తీసుకోవద్దన్న ప్రతిపక్ష బీజేపీ నేత అశోక
- ప్రజలు భయభ్రాంతులకు గురి కావొద్దనే ఉద్దేశంతో మంత్రి మాట్లాడారన్న బీజేపీ నేత
- కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసిందని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** హెచ్ఎంపీవీ వైరస్‌ను తేలిగ్గా తీసుకోవద్దని కర్ణాటక బీజేపీ హెచ్చరిం చింది. దేశంలో హెచ్ఎంపీవీ కేసులు నమోదవుతున్నాయి. బెంగళూరులో ఇద్దరు చిన్నారుల కు పాజిటివ్ అని తేలింది. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రతిపక్ష నేత (బీజేపీ)



వివరాలు 2లో..

## కేటీఆర్ ఓ బచ్చా.. కేసీఆర్ ఒక దుర్మార్గుడు



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వ సలహాదా రు షబ్బీర్ అలీ ఫైర్ అయ్యారు. మంగళవారం (జనవరి 7) నిజామాబాద్ పార్లమెంట్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర

వివరాలు 2లో..

## నేనే తప్పు చేయలేదు... ఎలాంటి విచారణకైనా సిద్ధమే

- భారత న్యాయవ్యవస్థపై విశ్వాసం ఉందన్న కేటీఆర్
- కక్ష సాధింపు చర్య అని తెలిసినా ఏసీబీ ఎదుట హాజరయ్యానన్న కేటీఆర్
- హైకోర్టు అనుమతిస్తే న్యాయవాదులతో కలిసి విచారణకు హాజరవుతానన్న కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:**ఫార్ములా ఈ-కార్ రేసులో తాను తప్పు చేయలేదని, ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని... భారత న్యాయస్థానాలపై తనకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో గల తన నివాసంలో ఆయన మాట్లాడుతూ... తనపై పెట్టిన కేసు కక్ష సాధింపు చర్య అని తెలిసినా ఏసీబీ ఎదుట

వివరాలు 2లో..

## ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ విజయం ఖాయం


- అభివృద్ధికి, అధికార దుర్వినియోగానికి జరుగుతున్న పోరు అని వ్యాఖ్య
- పార్టీ శ్రేణులు పూర్తి సామర్థ్యంతో సిద్ధం కావాలని పిలుపు
- ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన అభివృద్ధి పట్ల ఓటర్లు విశ్వాసంతో ఉన్నారన్న మాజీ సీఎం

**పెన్ పవర్ డెస్క్:**ఢిల్లీ ప్రజలు అభివృద్ధి వైపే చూస్తారని, రాను న్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ విజయం ఖాయ మని మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ ధీమా



వివరాలు 2లో..

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం... హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఉత్తర్వులు




- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- బుద్ధ భవన్‌లోని బీ-బ్లాక్‌లో త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు
- ఇప్పటికే హైడ్రాకు విస్తృత అవకాశాలు కల్పిస్తూ గెజిట్

వివరాలు 2లో..

### టిబెట్ పీఠభూమిలో భారీ భూకంపం...
## 95 మంది మృతి

7.1 తీవ్రతతో భారీ భూకంపం

నేలమట్టమైన భవనాలు

కొనసాగుతున్న సహాయక చర్యలు

భారత్ లోనూ ప్రకంపనలు



**హైదరాబాద్ పెన్ పవర్::**శక్తిమంతమైన భూకంపం టిబెట్ ను కుదిపేసింది. రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రత నమోదైన ఈ భూకంపం కారణంగా 95 మంది మృత్యువాత పడ్డారు. 130 మంది గాయపడ్డారు. నేపాల్ సరిహద్దుకు సమీపంలో టిబెట్ పీఠభూమిలో ఉదయం భూకంపం సంభవించింది.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ద్రవ్యోల్బణం, బలహీన రూపాయే అంశాలు

కరోనా తర్వాత ప్రపంచమంతా ఎదుర్కొంటున్న అత్యంత ప్రధాన సమస్య ద్రవ్యోల్బణం. భారతదేశం ఆర్థికంగా ముందడుగు వేస్తుందని చెబుతున్నప్పటికీ.. దేశంలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాల్సి అవసరం చాలా ఉంది. ఎందుకంటే, 2024 అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 14-నెలల గరిష్ఠ స్థాయి 6.21%కి చేరుకుంది. ఆహార ద్రవ్యోల్బణం 15-నెలల గరిష్ఠ స్థాయి 10.87%కి చేరుకుంది. 2023లో, గృహస్తుల ద్వారా వచ్చే పొదుపులు 50 ఏళ్ల కనిష్టానికి పడిపోయాయి. నగరాల్లో నివశిస్తున్న సగానికి పైగా జనం అప్పులతోనే జీవితాన్ని గడుపుతున్నారుపేదరికం తగ్గిందని చెబుతున్నప్పటికీ.. అప్పుల భారం సామాన్యుణ్ని ఊపిరి తీసుకోనివ్వడం లేదు. ఇలాంటి నేపథ్యంలో.. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాల్సి ఉంది. అది ఎంత త్వరగా జరిగితే.. దేశంతో పాటు రాష్ట్రాలు కూడా బాగుపడే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలోనే.. ఉఆఖ వృద్ధి చెందేలా చేయాలి. 2024 డిసెంబర్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉఆఖ వృద్ధి అంచనాలను 7.2% నుండి 6.6%కి తగ్గించింది. రెపో రేటును వరుసగా పదకొండు పర్యాయాలు తగ్గించలేదు. ప్రపంచంలోనే మూడో అత్యంత పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే ఈ టార్గెట్ సరిపోదన్నది ప్రధానికి తెలియని విషయం కాదు.దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపడటానికి విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం ప్రధాన సవాలుగా ఉంది. అయితే 2022-23, 2023-24 మధ్య 13 వేల కోట్ల రూపాయల విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గాయని లెక్కలు చెబుతున్నాయి. మరోవైపు, ఎలన్ మస్క్ లాంటి కుబేరుడు భారత్‌లో పెట్టుబడి పెడతామని చెప్పి, తర్వాత తత్సారం చేయడం ప్రారంభించారు. భారత్ పర్యటనను రద్దు చేసుకోని, చైనా వైపు చూపు తిప్పారు. ఇంకోవైపు, అదానీ, అంబానీల ఆస్తి గ్రాఫ్ కూడా ఇటీవల తగ్గు మొహం పట్టింది.భారత ప్రధాని మోదీ తీరిక లేకుండా విదేశీ పర్యటనలు చేస్తున్నప్పటికీ.. అనుకున్నంతగా విదేశీ పెట్టుబడులను భారత్ ఆకర్షించలేకపోతోంది. అమెరికాలో అధికార పీఠం ఎక్కబోతున్న డొనాల్డ్ ట్రంప్ చూస్తే.. టారిఫ్‌లతో అటాక్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మోడీ బాధ్యత మరింత పెరిగింది. అంతర్జాతీయంగా భారత ఆర్థిక వ్యవస్థకు మేలు జరగాలంటే.. రూపాయిని కూడా బలోపేతం చేయాల్సి ఉంది. 2024 డిసెంబర్‌లో.. రూపాయి మూడవ వరుస సెషన్‌లో బలహీనంగా మారింది. యూఎస్ డాలర్‌తో పోలిస్తే 85.27 వద్ద ఆల్ టైమ్ కనిష్ట స్థాయి వద్ద స్థిరపడింది. ఈ నేపథ్యంలో.. మోదీ ముందున్న పెద్ద సవాలు రూపాయిని బలోపేతం చేయడమే!ఇక, దేశంలో పేదరికం తగ్గుతుందని నివేదికలు వస్తున్నప్పటికీ.. నిరుద్యోగం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. అందుకే, మోదీ ప్రభుత్వం అర్జెంట్‌గా ఉపాధి కల్పనపై దృష్టి పెట్టాల్సి ఉంది. గత రెండేళ్లుగా 10% వద్దే చతికిలపడిన యువత నిరుద్యోగం రేటును ఈ ఏడాది అయినా మెరుగుపర్చాల్సి ఉంది. ఎకనామిక్ సర్వే ప్రకారం, దేశంలోని మొత్తం యువతలో సగం మంది కళాశాల నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత కూడా ఉద్యోగాలు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. పోస్ట్‌మ్యాన్ ఉద్యోగాలకు కూడా పోస్ట్ గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ హోల్డర్లు దరకాస్తు చేసుకుంటున్న పరిస్థితి ఉంది. ఒక విధంగా, దేశంలో చాలా మంది చదువుకు సంబంధించిన ఉద్యోగాలు చేయలేకపోతున్నారు.

స్వయం ఉపాధిని ఆశ్రయిద్దామనుకున్నా.. కార్పొరేట్ సంస్థలు వచ్చి చిన్నపాటి వ్యాపారాలను కూడా నిర్వీర్యం చేస్తున్న పరిస్థితి ఉంది. ఈ సమస్యను అధిగమించాలంటే.. ప్రభుత్వం సామాన్యులకు మేలు చేసే విధంగా విధివిధానాలను రూపొందించాల్సి ఉంది. గత నాలుగేళ్లలో పారిశ్రామిక రంగానికి రూ.5.65 లక్షల కోట్లు రుణమాఫీ చేశారు. దేశంలోని అతిపెద్ద ఉపాధి సంస్థ వ్యవసాయం, షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్‌ల నుండి అన్ని రంగాల్లో రుణాల రద్దు విషయంలో అతి తక్కువ శ్రద్ధ కనబరుస్తున్నారు. కాబట్టి, ఈ సంవత్సరమైనా కేంద్రం ఉద్యోగ కల్పన నుండి స్వయం ఉపాధిలో సామాన్యుడికి సహకరించాల్సి ఉంది.ఈ ఏడాది, ఏటా 17 లక్షల మంది భారతీయులకు ఆహార కొరత మోదీ ప్రభుత్వం ముందున్న అత్యంత ముఖ్యమైన సవాలు అందరికీ ఆహారాన్ని అందించడం. ఏటా 17 లక్షల మంది భారతీయులు తగినంత ఆహారం తీసుకోకపోవడం వల్ల వచ్చే వ్యాధులతో మరణిస్తున్నట్లు నివేదికలు ఉన్నాయి. 2013 నుండి భారతదేశం ఉఆఖలో 50% పెరిగినప్పటికీ.. ప్రపంచంలోని పోషకాహార లోపం ఉన్న పిల్లలలో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ మంది భారతదేశంలో నివసిస్తున్నారు. వీరిలో మూడేళ్లలోపు పిల్లల్లో సగం మంది తక్కువ బరువుతో ఉన్నారు.భారతదేశంలో పోషకాహార లోపానికి ప్రధాన కారణాలలో ఆర్థిక అసమానత ఒకటి. జనాభాలోని కొన్ని ప్రాంతాల్లో తక్కువ ఆర్థిక స్థితి కారణంగా, వారి ఆహారంలో తరచుగా నాణ్యత లోపం, పరిమాణంలోనూ తక్కువ ఉంటోంది. ఇలా పోషకాహార లోపం ఉన్న స్త్రీలకు ఆరోగ్యవంతమైన పిల్లలు పుట్టే అవకాశం తక్కువ. అధిక పోషకాహారం తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తుంది. భారతదేశంలో జాతీయ స్థూలకాయం రేట్లు 2010లో స్త్రీలకు 14%, పురుషులకు 18%గా ఉంది. కొన్ని పట్టణ ప్రాంతాలలో 40% కంటే ఎక్కువగా ఉంది. ఊబకాయం వల్ల హృదయ సంబంధ వ్యాధులు, మధుమేహం, క్యాన్సర్లు, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు వంటి అనేక నాన్-కమ్యూనికేబుల్ వ్యాధులకు కారణమవుతుంది.మరోవైపు, పోషకాహార లోపం ఉన్న వ్యక్తులతో.. సమాజానికి దీర్ఘకాలిక నష్టం ఉంది. మంచి ఆహారం తీసుకునే వారితో పోలిస్తే, పోషకాహార లోపం ఉన్న వ్యక్తులు న్యుమోనియా, క్షయ వంటి అంటు వ్యాధులకు లోనవుతారు. ఇది అధిక మరణాల రేటుకు దారితీస్తుంది. అంతేకాకుండా, పోషకాహార లోపం ఉన్న వ్యక్తులు పనిలో తక్కువ ఉత్పాదకతను కలిగి ఉంటారు. తక్కువ ఉత్పాదకత వారికి తక్కువ వేతనాన్ని అందించడమే కాకుండా వారిని పోషకాహార లోపం అనే విష వలయంలోకి నెడుతుంది.అందరికీ సమాన వేతనాలు ఉండేలా చూసుకోవడం వల్ల అందరూ మంచి ఆహారాన్ని పొందడానికి అవకాశం ఉంటుంది. గత దశాబ్దంలో వాస్తవ వేతనాల వార్షిక వృద్ధి రేటు అఖిల భారత స్థాయిలో సున్నాకి దగ్గరగా ఉంది. గత ఐదు సంవత్సరాలుగా గ్రామీణ వాస్తవ వేతనాలు 0.4% తగ్గాయి. అలాగే, వ్యవసాయ వేతనాలు 0.2% వద్ద నిలిచిపోయాయి. ఐదుగురిలో నలుగురు వ్యక్తులు 2021 నాటికి రూ.515 కంటే తక్కువ సంపాదిస్తున్నారు. అయితే, సామాజిక-ఆర్థిక సంక్షేమంలో మెరుగుదల ఉంటే.. పిల్లల పోషకాహారం కూడా మెరుగుపడుతుందని ఆరోగ్య నిపుణులు కూడా భావిస్తున్నారు. కాబట్టి, దేశంలో ప్రజల ఆరోగ్యంతో పాటు దేశ ఆర్థిక స్థితి మెరుగుపడాలన్నా మోడీ ప్రభుత్వం ఈ సవాళ్లను పరిష్కారించే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.ఇక, దేశంలో అట్టడుగున ఉన్నవారికి గౌరవం కల్పించాలనే డిమాండ్ కూడా ఉంది. ఇందులో భాగంగా.. ముఖ్యంగా, మాన్యువల్ స్కావెంజింగ్ నిషేధాన్ని సరిగ్గా అమలు చేయాల్సి ఉంది. మాన్యువల్ స్కావెంజింగ్ 2013లో నిషేధించబడినప్పటికీ.. 2018-2020 మధ్య, మురుగు కాలువలు, సెప్టిక్ ట్యాంక్‌లను శుభ్రం చేయడం వల్ల 443 మంది మరణించారు. ఇక, మోడీ పాలనలో నిజానిజాలను బయటకు తీసుకొచ్చే జర్నలిస్టుల మీద దాడులు మరింత పెరిగాయన్నది స్పష్టంగా లెక్కలు చెబుతున్న వాస్తవాలు.2019 నుండి.. 100 బిల్లులు, రెండు గంటలలోపే ఆమోదించబడ్డాయి. 17వ లోక్‌సభలో, పార్లమెంటులో ప్రవేశపెట్టిన 10 బిల్లుల్లో 9 బిల్లులపై ఎవర్నీ సంప్రదించలేదు.. ఒక వేళ ఏదైనా చర్చ సాగినా అది అసంపూర్తిగానే మిగిలింది. ఇలా, ఏకపక్షంగా బిల్లులు ఆమోదించిన ఘనత మోడీకి దక్కిందని విపక్షాలతో పాటు ప్రజా సంఘాలు కూడా దుమ్మెత్తి పోశాయి. అయినా, పరిస్థితుల్లో మార్పు రాలేదు. ఈ ఏడాది జరిగే లోక్ సభ సమావేశాల్లో అయినా సక్రమంగా జరుగుతుందోమో చూడాలి.ఇక, సురక్షితమైన ప్రజా మౌలిక సదుపాయాలపై కూడా విమర్శలు లేకపోలేదు. 2017-2022 మధ్య 244 రైలు ప్రమాదాలు జరిగాయి. మోర్బిలో వేలాడే వంతెన కూలిపోవడంతో 135 మంది మరణించారు. ఉత్తరకాశీ టన్నెల్‌లోకి ప్రవేశించిన తర్వాత 41 మంది కార్మికులు 17 రోజుల పాటు చిక్కుకుపోయారు. దీనికి తోడు.. దేశంలో సురక్షితమైన ఇంటర్నెట్ లోపం కారణంగా.. 2024 మొదటి తొమ్మిది నెలల్లో "డిజిటల్ అరెస్టులకు" సంబంధించిన మోసాలు రూ.1616 కోట్ల విలువైన నష్టాలను చూశాయి.ఏడాది క్రితం చట్టం ఆమోదించబడినప్పటికీ డిజిటల్ డేటా రక్షణ నియమాలు నోటిఫై చేయలేదు. ఇవన్నీ మోదీ ప్రభుత్వంపై కేవలం విమర్శలు మాత్రమే కాదు. ఇది మోదీ ప్రభుత్వం ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా. మూడో టర్మ్‌లో ఆరు మాసాలు దాటిపోయిన కేంద్ర ఎన్డీయే ప్రభుత్వం, వీటన్నింటిపై ఇప్పుడు ధ్యాస పెట్టాల్సి ఉంది. మరి, ఈ కొత్త సంవత్సరంలో మోదీ ఈ సమస్యలను పరిష్కరిస్తారో లేదో చూడాలి.

# కేటీఆర్ అరెస్టుకు లైన్ క్లియర్..!

- మొదటి పేజి తరువాయి

జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు.ఫార్ములా - ఈ రేసు వ్యవహారంలో ఒప్పందం జరగకముందే చెల్లింపులు చేశారని ఆయన కోర్టుకు తెలిపారు. బ్రిటన్ పౌండ్ల రూపంలో రూ.46 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ఈ - కార్ల రేసింగ్ సీజన్ 10 ఒప్పందానికి ముందే నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు చేశారన్నారు. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ దవే వాదనలు వినిపించారు. ఏసీబీ అధికారులు నమోదు చేసిన సెక్షన్లు కేటీఆర్‌కు వర్తించవని కోర్టుకు తెలిపారు. ఫిర్యాదు దారు దానకిశోర్ తరఫున సీనియర్ న్యాయవాది సీపీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. మున్సిపల్ మంత్రి పర్యవేక్షణలోనే ఆ శాఖ అధికారులు విధులు నిర్వహిస్తారని, రేసింగ్‌కు సంబంధించిన చెల్లింపుల ఫైల్ పై అప్పటి మంత్రి కేటీఆర్ ఆమోదిస్తూ సంతకం చేశారన్నారు. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ దవే వాదనలు వినిపించారు. ఏసీబీ అధికారులు నమోదు చేసిన సెక్షన్లు కేటీఆర్‌కు వర్తించవని కోర్టుకు తెలిపారు. నగదు బదిలీలో కేటీఆర్ ఎక్కడా లబ్ధిపొందలేదని, అవినీతి జరిగినట్లు కూడా ఎఫ్ఐఆర్‌లో ఎక్కడా పేర్కొనలేదని తెలిపారు.

ముగ్గురి వాదనలూ విన్న న్యాయస్థానం తాము తదుపరి తీర్పు ఇచ్చే వరకు కేటీఆర్ ను అరెస్టు చేయొద్దని సూచించి తీర్పు రిజర్వులో పెట్టింది. అదే సమయంలో విచారణకు సహకరించాలని పేర్కొంటూ కేటీఆర్ కు సూచించింది. ఈ అంశంపై ఇవాళ హైకోర్టు తీర్పు వెల్లడించింది. ఏసీబీ వాదనలో ఏకీభవిస్తూ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ ను కొట్టేసింది. కేటీఆర్ ను అరెస్టు చేయొద్దంటూ ఇచ్చిన స్టేను కూడా ఎత్తేసింది. దీంతో ఆయన అరెస్టుకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ తీర్పుపై కేటీఆర్ డివిజన్ బెంచ్ కు వెళ్తారా..? సుప్రీంకోర్టును ఆశ్రయిస్తారా..? అన్న చర్చ మొదలైంది.

**ఎల్లుండి ఏసీబీ విచారణ**

ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్ నిన్న ఏసీబీ విచారణకు హాజరు కావాల్సి ఉంది. ఏసీబీ ఆఫీసు వరకు వెళ్లిన ఆయన తన లాయర్ ను అనుమతించకపోవడంతో అధికారులతో వాగ్వాదానికి దిగి తిరిగి వెళ్లిపోయారు. దీంతో ఏసీబీ ఈ నెల 9న విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు జారీ చేసింది. దీంతో ఆయన తప్పకుండా విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. అయితే విచారణకు హాజరవుతారా..? సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ లో అప్పీల్ చేస్తారా..? లేదా సుప్రీం కోర్టుకు వెళ్తారా..? అన్నచర్చ మొదలైంది. ఈ నెల 9న విచారణకు పిలిచిన ఏసీబీ అక్కడే అరెస్టు చేసే అవకాశమూ లేకపోలేదని అంటున్నారు. ఆయనపై పెట్టిన సెక్షన్ల ప్రకారం అరెస్టు కే అవకాశం ఎక్కువని న్యాయనిపుణులు చెబుతున్నారు.

# బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే గాంధీభవన్ పునాదులు లేకుండా చేస్తారు

- మొదటి పేజి తరువాయి

లేకుండా చేస్తారని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దాడులు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని బండి సంజయ్ ప్రశ్నించారు. ఇతర పార్టీల కార్యాలయాలపై రాళ్ల దాడులను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించాలనుకుంటోందా? అని మండిపడ్డారు. రాళ్లు పిల్లలకు, వృద్ధులకు తగిలితే పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించరా? అని ప్రశ్నించారు. ఎవరైనా తప్పుడు వ్యాఖ్యలు చేస్తే... వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిందేనని చెప్పారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని భయపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బీజేపీ కార్యాలయంపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

# నాంపల్లిలో ఉద్రిక్తత.. బీజేపీ వర్సెస్ కాంగ్రెస్

- మొదటి పేజి తరువాయి

బిదూరి పోటీ చేస్తున్నారు. ఇటీవల ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రియాంక గాంధీపై మాట తూలారు. తాను ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిస్తే కల్కాజీ నియోజకవర్గంలోని రోడ్లను ప్రియాంక బుగ్గల్లా నున్నగా తయారు చేస్తానంటూ కామెంట్ చేయడంతో కాంగ్రెస్ కార్యకర్తలు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నారు.

# టిబెట్ పీఠభూమిలో భారీ భూకంపం... 95 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

టిబెట్ లోని షిజాంగ్ నగరానికి సమీపంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్టు యూఎస్ జియోలాజికల్ సర్వే (యూఎస్ జీఎస్) గుర్తించింది. ఒక్కసారిగా భూమి ఊగిపోవడంతో ప్రజలు ఇళ్లలోంచి పరుగులు తీశారు. అనేక భవనాలు నేలమట్టం అయ్యాయి. భారీ భూకంపం తర్వాత టిబెట్ భూభాగంలో భూమి దాదాపు 50 సార్లు కంపించింది. వీటి తీవ్రత రిక్టర్ స్కేలుపై 5కి లోపే నమోదైంది. కాగా, ఈ భూకంపం ప్రభావం భారత్ లోని ఉత్తరాది రాష్ట్రాల్లోనూ కనిపించింది. దేశ రాజధాని ఢిల్లీ పరిసర ప్రాంతాలు, బీహార్, బెంగాల్ రాష్ట్రాల్లో స్వల్ప ప్రకంపనలు వచ్చాయి. అటు, టిబెట్ లో భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసా గుతున్నాయి. శిథిలాల తొలగింపు కొనసాగేకొద్దీ, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# కేటీఆర్ ను అరెస్ట్ చేస్తే చేసోకొనియ్యండి..

- మొదటి పేజి తరువాయి

చేస్తామంటే చేసుకోమనివ్వండి.. భయపడేది లేదన్నారు హరీశ్ రావు. ఫార్ములా ఈ కారు రేసు కేసులో అవినీతే జరగలేదని.. నయా పైసా కూడా ప్రభుత్వం నుంచి గ్రీన్ కో సంస్థకు వెళ్లలేదని.. అవినీతి లేనప్పుడు విచారణకు ఎందుకు భయపడతాం అన్నారు హరీశ్. విచారణ ఎదుర్కోవటానికి కేటీఆర్ సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు హరీశ్ రావు.రాబోయే రోజుల్లో ఇలాంటి మరిన్ని కేసులు పెట్టొచ్చని.. ఒత్తిళ్లు రావొచ్చని.. అయినా వెనక్కి తగ్గేది లేదన్న హరీశ్ రావు.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందు వల్లే.. ఆరు గ్యారంటీపై నిలదీస్తున్నందు వల్లే అక్రమ కేసులు పెడుతున్నట్లు అభిప్రాయం వ్యక్తం చేశారు హరీశ్ రావు.ఫార్ములా ఈ రేసు కేసు అనేది ఓ తుఫేల్ కేసు అని.. ఇది కోర్టుల్లో నిలబడదు అంటూ జోస్యం చెప్పారు హరీశ్ రావు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కోసమే ఫార్ములా ఈ కారు రేసు పెట్టాం అని.. ఇదేమీ సొంతానికి పెట్టింది కాదంటూ వివరించారు హరీశ్ రావు. జనవరి 9వ తేదీన ఏసీబీ విచారణ ఉందని.. ఆ రోజు విచారణకు కేటీఆర్ హాజరవుతున్నట్లు వెల్లడించారు హరీశ్ రావు.కేటీఆర్ ను అరెస్ట్ చేస్తే చేసోకొనివ్వండి.. కోర్టులోనే తేల్చుకుంటాం అన్నారు హరీశ్ రావు.

# నేనే తప్పు చేయలేదు... ఎలాంటి విచారణకైనా సిద్ధమే

- మొదటి పేజి తరువాయి

విచారణకు హాజరయ్యానన్నారు.

తనపై పెట్టింది అక్రమ కేసు అని, రాజకీయ ప్రేరేపితమైనదన్నారు. అవినీతిపరులకు ఇతరులు ఏం చేసినా అవినీతిగానే కనిపిస్తుందన్నారు. ఫార్ములా ఈ-కార్ రేసు వ్యవహారంలో పైసా అవినీతి జరగలేదన్నారు. తెలంగాణ ఇమేజ్‌ను పెంచేందుకే పార్ములా ఈ-రేస్ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రేవంత్ రెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకొని తనపై కేసు పెట్టారని ఆరోపించారు.తన లాయర్‌తో కలిసి విచారణకు హాజరవుతానంటే వద్దని చెబుతున్నారని మండిపడ్డారు. హైకోర్టు అనుమతిస్తే తమ న్యాయవాదులతో కలిసి ఏసీబీ విచారణకు హాజరవుతానన్నారు. సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేస్తామన్నారు. దుర్మార్గుల నుంచి చట్టపరంగా రక్షణ కోరుతున్నానన్నారు. ఏసీబీ అధికారులు తన హక్కులకు భంగం కలిగేలా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు.

తమ పార్టీకి చెందిన పట్నం నరేందర్ రెడ్డి విచారణలో ఇవ్వని స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు చెప్పారని, తన న్యాయవాది రాకుంటే తన విషయంలోనూ అలాగే చేస్తారని అనుమానం వ్యక్తం చేశారు. అందుకే న్యాయవాదుల సమక్షంలో విచారణ కోరామన్నారు. చివరకు న్యాయం గెలుస్తుందని వ్యాఖ్యానించారు.మంత్రి పొంగులేటి తనపై విమర్శలు చేయడాన్ని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా... కేటీఆర్ స్పందించారు. పాపం ఆయనకు కొత్తగా మంత్రి పదవి రావడంతో ఆ ఉత్సాహంతో ఆగడం లేదని ఎద్దేవా చేశారు. ఎవరి వద్ద రియల్ ఎస్టేట్ భూములు లాక్కున్నారు, ఏయే భూములు 30 శాతం నుంచి 40 శాతం రాయించుకున్నారో అన్నీ బయటకు వస్తాయన్నారు.

# ఈవీఎం ట్యాంపరింగ్ జరుగుతోందనేది నిరాధార ఆరోపణ

- మొదటి పేజి తరువాయి

వీవీ ప్యాట్ స్లిప్పుల లెక్కింపులో ఇప్పటివరకు ఎక్కడా తేడా రాలేదని తెలిపారు. పోలింగ్ శాతం పెరుగుదలపైనా తప్పుడు ప్రచారం జరుగుతోందని అన్నారు. పోలింగ్ సమయం ముగిసే సమయానికి ఎంతో పోలింగ్ శాతం నమోదైందో ఒకసారి ప్రకటిస్తున్నామని రాజీవ్ కుమార్ తెలిపారు. పోలింగ్ సమయం ముగిశాక... అప్పటికే క్యూలైన్లలో ఉన్నవారు ఓటేస్తున్నారని, కొన్ని చోట్ల రాత్రి 8 గంటల వరకు కూడా పోలింగ్ జరుగుతోందని వెల్లడించారు. అందువల్ల పోలింగ్ శాతంపై చివరి లెక్కలు ఆలస్యంగా వస్తున్నాయని వివరించారు.

గత కొన్నేళ్లుగా ఎన్నికల్లో ఓడిపోయిన రాజకీయ పార్టీలు ఈవీఎంలను నిందిస్తుండడం తెలిసిందే. ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతోందంటూ పలు పార్టీలు గగ్గోలు పెడుతున్నాయి. ఈ ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం పైవిధంగా స్పందించింది.

# కేటీఆర్ ఓ బచ్చా.. కేసీఆర్ ఒక దుర్మార్గుడు

- మొదటి పేజి తరువాయి

పోషించిన భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళు లర్పించిన దుర్మార్గుడు కేసీఆర్ అని విమర్శించారు. కేసీఆర్ కుమారుడు కేటీఆర్ ఓ బచ్చా అని ఎద్దేవా చేశారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో ఊసరవెల్లిలా కేటీఆర్ మాటలు మారుస్తున్నారని మండిపడ్డారు. కార్యకర్తల కష్టంతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలకు ఆర్థికంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యకర్తలు బలంగా ఉంటే.. పార్టీ బలంగా ఉంటుందన్న షబ్బీర్ అలీ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు మనదేనని ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే రైతు భరోసా ఇస్తామని, కేసీఆర్ లాగా గుట్టలు, రాళ్ళు, రియల్టర్లకు రైతు భరోసా ఇవ్వమన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ విజయం ఖాయం

- మొదటి పేజి తరువాయి

వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు అభివృద్ధికి, అధికార దుర్వినియోగానికి మధ్య జరుగుతున్న పోరు అన్నారు. నేడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ... ఎన్నికల తేదీలు వచ్చాయని... పార్టీ శ్రేణులు పూర్తి సామర్థ్యంతో ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.పదేళ్లలో ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన అభివృద్ధి పట్ల ఓటర్లు పూర్తి విశ్వాసంతో ఉన్నారని వ్యాఖ్యానించారు. అందుకే వారు తమ పార్టీ వైపే చూస్తారని భావిస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో కచ్చితంగా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలే తమ బలమన్నారు. కార్యకర్తల బలం ముందు ప్రతిపక్ష వ్యవస్థలన్నీ విఫలమవుతాయన్నారు.

# ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు మేడారం మినీ జాతర

- మొదటి పేజి తరువాయి

వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. పూర్వపు వరంగల్ జిల్లా ప్రస్తుత ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో జరిగే ఒక గిరిజన జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతరగా ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. సమ్మక్క -సారక్కలను భక్తుల కష్టాలను కడతేర్చే వనదేవతలుగా, ఆపదలో ఉన్న వారిని ఆదుకొనే ఆపద్బాంధవులుగా గుర్తించి వనదేవతలుగా పూజిస్తున్నారు. కోయ గిరిజనుల ఉనికి కోసం పోరాడి వీర మరణం పొందిన సమ్మక్క, -సారలమ్మ జాతర ఓరుగల్లును పాలించిన ప్రతాపరుద్రుడు కాలం నుంచి కొనసాగుతున్నట్లు స్థలపురాణాలు చెప్తున్నాయి. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతర. 1996లోనే ఈ జాతరను తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తించారు. భారత దేశంలో కుంభమేళా తరువాత అత్యధికులు హాజరయ్యే జాతర ఇదే.

# హెచ్‌ఎంపీవీ వైరస్‌ను తేలిగ్గా తీసుకోవద్దు

- మొదటి పేజి తరువాయి

ఆర్.అశోక మాట్లాడుతూ... ఈ వైరస్‌ను తేలిగ్గా తీసుకోవద్దన్నారు. కొత్త వైరస్ పట్ల ప్రజలు భయాందోళనకు గురికావొద్దనే ఉద్దేశంతో మంత్రి దినేశ్ గుండూరావు అదేమంత ప్రమాదకరం కాదన్న రీతిలో మాట్లాడారన్నారు.దాని గురించి ఏమీ తెలియనప్పుడు హెచ్‌ఎంపీవీని తేలికగా తీసుకోరాదన్నారు. హెచ్‌ఎంపీవీ చైనాలో బీభత్సం సృష్టిస్తోందన్నారు. అక్కడి చిన్నారులు ఆసుపత్రి పాలయ్యారని అన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసిందన్నారు.వ్యాధి వచ్చినప్పుడు కాకుండా... రాకముందే జాగ్రత్తలు తీసుకోవడం మంచిదన్నారు. ఈ వైరస్ ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతోందన్నారు. జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెచ్‌ఎంపీవీని ఎలా ఎదుర్కోవాలో ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆక్సిజన్ సిలిండర్ల లభ్యత, ఐసీయూ బెడ్ల వంటి సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం... హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఉత్తర్వులు

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని బుద్ధ భవన్ బీ-బ్లాక్‌లో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో ఇక్కడ పోలీస్ స్టేషన్ ఏర్పాటు కానుంది. హైడ్రాకు విస్తృత అధికారాలను కల్పిస్తూ ఇప్పటికే ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.హైదరాబాద్ పరిధిలోని చెరువులు, ఇతర ఆస్తులను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. అయితే, హైడ్రా ఏర్పాటుపై ప్రశ్నలు వచ్చాయి. దీంతో జీహెచ్‌ఎంసీ చట్టం 1955ను సవరించారు. చెరువులు, ఆస్తులను కాపాడేందుకు అధికారిని లేదా సంస్థను ఏర్పాటు చేసే అధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెడుతూ జీహెచ్‌ఎంసీ చట్టంలో 374 బీ సెక్షన్‌ను చేర్చారు.

# రిజర్వేషన్లు మారితే ఏంటీ...

**మహబూబ్ నగర్, జనవరి 7, పెన్ పవర్:** మరో 9 రోజుల్లో మున్సిపాలిటీ పాలక వర్గం పదవి కాలం ముగియనుండడంతో వచ్చే మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార, ప్రతి పక్ష పార్టీలు దృష్టి పెట్టాయి. గత ఏడాది క్రితం సర్పంచ్‌ల పదవి కాలం ముగియడం తో గ్రామాల్లో ప్రత్యేక పాలనను ప్రభుత్వం కొనసాగిస్తుంది. దీంతో పాటు మండలం వ్యవస్థ ఎంపిటిసి, జెడ్పిటిసి పదవి కాలం ముగిసినప్పటికీ ఎన్నికలను నిర్వహించ డంలో ప్రభుత్వం వెనుక అడుగు వేస్తుంది.దీంతో పాటు మరో 9 రోజుల్లో మున్సిపా లిటీ పాలకవర్గం పదవి కాలం ముగియ నున్న నేపథ్యంలో మున్సిపాలిటీలో సైతం ప్రత్యేక పాలన దిశగా ప్రభుత్వం అడుగులు వేయనుంది. ఈ నేపథ్యంలో ఒక పక్కన సం క్రాతి పండుగకు ఇందిరమ్మ రైతు భరోసా పేరుతో రైతులకు పెట్టుబడి సహాయం, నిరు పేదలకు నూతన రేషన్ కార్డు ల మంజూరు, ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియను సైతం వేగవంతం చేస్తూ వాటిని ప్రజలోకి తీసు కుని వెళ్లి అనుకూలత పెంచుకోవాలన్న ల క్ష్యంతో గ్రామీణ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేసేందుకు ప్రణాళిక రచిస్తోంది.కానీ కాంగ్రెస్ పార్టీలో నేతల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గు మనే స్థాయిలో వర్గ పోరు నడుస్తుంది. వనపర్తిలో స్థానిక ఎమ్మెల్యే మే ఘారెడ్డి రాకను శాసనసభ ఎన్నికల ముందు నుండి వ్యతిరేకించిన ప్రస్తుత రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి వర్గం, గద్వాలలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పార్టీ మార్పు వ్యవహారాని వ్యతిరేకి స్తున్న మాజీ జెడ్పి చైర్ పర్సన్ సరిత వర్గం ల మధ్య త్రీవ స్థాయిలో వర్గ పోరు నడు స్తుంది.దీంతో పాటు అలంపూర్ నియోజ కవర్గంలో ఎంఎల్‌సి చల్లా వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్యే విజేయుడు రాకను ఏఐసిసి కార్య దర్శి సంపత్ కుమార్ సైతం వారి రాకను వ్యతిరేకించగా ప్రస్తుతం వారు బిఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్న పరిస్థితి. కానీ రెండు వర్గాలలో మాత్రం పార్టీలో పరో క్షంగా కలిసి నట్లుగానే చర్చ నడుతోంది. ఈ నేపథ్యంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వర్గ పోరును నిలువరించేందుకు పార్టీ తీసుకునే నిర్ణయాల పైనే ఆసక్తి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో చిన్న జిల్లాల ఏర్పాటు చేయడంతో మేజర్ గ్రామ పంచా యతీలను విలీన గ్రామాలను మున్సిపాలి టీలుగా మార్చగా ఒక పర్యాయం మున్సిపా లిటీ ఎన్నికలు సైతం జరిగాయి. రాష్ట్రంలో కులగణన కార్యక్రమం సైతం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించడం జరిగింది. దీంతో మున్సిపాలిటీ పరిధిలో ఆయా వార్డులో కు ల గణన ప్రకారంగా రిజర్వేషన్లు సైతం మారె అవకాశాలు ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది రిజర్వేషన్లు మారితే ప్రస్తుత ఉన్న వార్డులు కాకుండా ఇతర వార్డుల నుండి ఫోటి చేయాలా ఒక వేళ ఫోటి చేసిన గెలుపు దక్కుతుందా లేక మహిళల రిజర్వేషన్ అయితే తమ కుటుం బంలోని మహిళలను ఫోటీలో నిలబెట్టాలా అనే సమాధానాలు లేని పలు ప్రశ్నలుగా నాయకుల ఊహలో మెదులుతున్నాయి. జిల్లాలో తమ పార్టీలు బలంగా ఉండా లంటే మున్సిపాలిటీలు కీలక పాత్రను పోషి స్థాయి. స్థానిక సంస్థలో తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలకు, పాలన పట్ల ప్రజలు అందరు హస్తం వైపు ఉన్నారని కాంగ్రెస్ నాయకులు ధీమాను వ్యక్తం చేస్తు న్నప్పటికి సంవత్సర కాలం నుండి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని ప్రజలంతా తిరిగి బిఆర్ఎస్ వైపు చూస్తు న్నారని స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు మున్సిపాలిటీ ఎన్నికల్లో తమ పార్టీ జెండా ఎగురవేస్తామని కాంగ్రెస్, బిఆర్ఎస్ అగ్ర నాయకులు ధీమాలను వ్యక్తం చేస్తున్నారు. అందుకు సంబందించి మున్సిపాలిటీ పాలక వర్గం ముంగిపు కాకముందే గ్రౌండ్ స్థాయి లో తమ తమ ఎత్తుగడలో బిజీగా ఉన్నారు గడిచిన 10 ఏండ్ల తరువాత తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చింది. దీంతో ప్రతిపక్ష పార్టీలు అయిన బి ఆర్ ఎస్, బిజెపి పార్టీల నుండి కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలోకి చేరడంతో పాటు వనపర్తి మున్సిపాలిటీ పరిధిలో అప్పటికే ఉన్న బి ఆర్ఎస్ పార్టీలకు చెందిన చైర్మన్, వైస్ చైర్మ న్‌ల అవిశ్వాస తీర్మానం పెట్టి ఆ స్థానంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ పై జెండాను ఎగురవేసింది.గతంలో జరిగిన మున్సిపా లిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ చేతిలో ఓడిపోయి నాయకులుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండగా ప్రభుత్వం మారిన వెంటనే చాలా మంది కౌన్సిలర్లు బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రె స్ లోకి చేరారు ఇప్పటి వరకు బాగానే ఉన్న అసలు సమస్య ప్రారంభం అయింది.గతంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు, ఎదుగు తున్న నాయ కులు, బిఆర్ఎస్ నుండి వచ్చిన కౌన్సిలర్లు నాయకులు పెరగడంతో తమకే టికెట్ వస్తుందని ఇప్పటికే ఆయా వార్డులో చెప్పు కుంటూ చావులు, అనారోగ్యాలు పాలు అయిన వారిని పరామర్శలు సైతం చేస్తు ఉన్నంతలో ఆర్థిక సహాయాలు చేస్తూ మరొ క వైపు యువత తమ వైపు ఉండేలా ఇప్పటి నుండే వారిని మచ్చిక చేసుకుంటున్నారు . దీంతో ప్రతిపక్ష పార్టీల కంటే కాంగ్రెస్ పార్టీలో ఆశావాహుల సంఖ్య మరింత పెరుగుతోంది.

# తీవ్రంగా ఉన్నది నిజమే.. కానీ భయపడాల్సిన అవసరం లేదు

**బీజింగ్, జనవరి 7, పెన్ పవర్:** కరోనా మిగిల్చిన విషాదం, నష్టాన్ని మర్చిపోకముందే.. చైనాలో మరో వైరస్ వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది, ఇతర దేశాలకూ ఈ వైరస్ వ్యాప్తికి సంబంధించిన నివేదికల మధ్య, చలికాలంలో సంభవించే శ్వాసకోశ వ్యాధుల కేసులు గతేడాది కంటే ఈ సంవత్సరం తక్కువగా ఉన్నాయని చైనా తెలిపింది. విదేశీయులు బీజింగ్‌కు వెళ్లొచ్చని, ఎలాంటి ప్రమాదమూ, రిస్క్ లేదని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. "ఉత్తరార్థగోళంలో శీతాకాలంలో సాధారణంగా శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు గరిష్ట స్థాయిలో ఉంటాయి. కానీ అంతకుముందు సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది చైనాలో ఇన్ఫ్లుఎంజా ం, ఇతర శ్వాసకోశ సంబంధిత వ్యాధులు తక్కువ స్థాయిలో వ్యాప్తి చెందాయి" అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ చెప్పారు. "చైనాలోని పౌరులు, విదేశీయుల ఆరోగ్యం గురించి చైనా ప్రభుత్వం శ్రద్ధ వహిస్తుందని నేను మీకు హామీ ఇస్తున్నాను. చైనాలో ప్రయాణించడం సురక్షితమే" అని తెలిపారు.రీసెంట్ గా చైనాలో వెలుగులోకి వచ్చిన హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ అనే వైరస్.. ఇప్పుడు ఇతర దేశాలనూ వణికిస్తోంది. సోషల్ మీడియాలోనూ ఈ వైరస్ కు సంబంధించిన పోస్టులు, వైరల్ అయ్యాయి. అనేక వీడియోల్లో ఆస్పత్రులు పేషెంట్స్ తో కిక్కిరిసినట్టు కనిపించాయి. ముఖానికి మాస్క్ లతో జనాలు కుప్పలు కుప్పలుగా కనిపించాయి. ఇవి నెటిజన్లతో పాటు ఇతరులకూ భయాందోళనలకు గురిచేశాయి, ఆల్రెడీ కొవిడ్ తో నానా అవస్థలు పడిన జనం... మళ్లీ ఆ రోజులు వస్తాయా అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరోనాతో కోల్పోయిన తమ బంధువులు, స్నేహితులను తలచుకుని.. లాక్ డౌన్ వంటి పరిస్థితుల్ని తలచుకుని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇక శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధుల నివారణ, నియంత్రణకు సంబంధించి నేషనల్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ చైనా జారీ చేసిన





మార్గదర్శకాలను కూడా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రస్తావించింది. చైనాలో మెటాప్న్యూమోవైరస్ వ్యాప్తి గురించి ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ డాక్టర్ అతుల్ గోయల్ సమాచారాన్ని అందించారు. ఇది తీవ్రంగా ఉన్నప్పటికీ, భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. "ఇది పెద్ద ఆందోళనకు కారణమని మేం నమ్మం. ఎందుకంటే ఇది జలుబు వంటి లక్షణాలను కలిగించే సాధారణ శ్వాసకోశ వైరస్. కొన్ని సందర్భాల్లో, ఫ్లూ లాంటి లక్షణాలను కలిగిస్తుంది. ముఖ్యంగా వృద్ధులు, ఒక సంవత్సరం కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో ఈ లక్షణాలు కనిపించవచ్చు" అని డాక్టర్ గోయల్ వివరించారు. "కానీ అందరూ అనుకుంటున్నట్టు ఇది అంత అత్యంత తీవ్రమైన వ్యాధి, అనారోగ్యం కాదు. ఎవరూ దీని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చలికాలంలో సాధారణంగానే శ్వాసకోశ వైరస్ ఇన్ఫెక్షన్లు పెరుగుతాయి. ఆస్పత్రుల్లో ఇప్పటికే ఇందుకు కావల్సిన పడకలు, సౌకర్యాలు చేశాం. దీనికి నిర్దిష్ట యాంటీవైరల్ మందులు అవసరం లేదు. ఈ వైరస్‌కు నిర్దిష్ట మందులు కూడా లేవు" అని అతుల్ చెప్పారు.

# వరంగల్ రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సులు




**వరంగల్, జనవరి 7, పెన్ పవర్:** వరంగల్ రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు పెట్టనున్నాయి. కాలుష్యంతో పాటు ఖర్చును తగ్గించేందుకు టీజీఎస్ ఆర్టీసీ ఈ ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొస్తుంది. వరంగల్ రీజియన్‌కు మొత్తంగా 112 బస్సులను కేటాయించారు. అందులో ముందస్తుగా 75 వెహికిల్స్ వరంగల్‌కు చేరుకున్నాయి. వాటిని ప్రారంభించనున్నారు.వాస్తవానికి ఆదివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ మంత్రుల బిజీ షెడ్యూల్ కారణంగా ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభోత్సవాన్ని వాయిదా వేశారు. సోమవారం నిర్వహించే ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రులు హాజరవుతారా లేదా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉందిఆర్టీసీ వరంగల్ రీజియన్ కు కేటాయించిన ఎలక్ట్రిక్ బస్సులను మొదటగా వరంగల్-2 డిపోకు కేటాయించారు. ఇక్కడ ఎలక్ట్రిక్ చార్జింగ్ పాయింట్లు, సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి అయ్యింది. ఇదిలాఉంటే టీజీఎస్ఆర్టీసీ వరంగల్ రీజియన్ కు 112 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించగా.. వాటిలో 19 సూపర్ లగ్జరీ, 18 డీలక్స్, 75 ఎక్స్ ప్రెస్ సర్వీసులు ఉన్నాయి.వరంగల్ రీజియన్ కు కేటాయించిన వాటిలో ఇప్పటివరకు 75 బస్సులు హనుమకొండలోని వరంగల్ 2 డిపోకు చేరుకున్నాయి. వీటిలో 19 సూపర్ లగ్జరీ, 16 డీలక్స్, 40 ఎక్స్ ప్రెస్ బస్సులు ఉన్నాయి. జెబీఎం సంస్థ నిర్వహణలో ఎలక్ట్రిక్ బస్సులు నడవనుండగా.. ఆ సంస్థ డ్రైవర్ల రిక్రూట్మెంట్ బాధ్యతను శ్రీ బాలజీ కన్సల్టెన్సీకి అప్పగించింది. దీంతో డ్రైవర్ల ఎంపిక ప్రక్రియను కొనసాగుతోంది. మొత్తం 112 బస్సులకు 260 మంది డ్రైవర్లు అవసరం కాగా.. ఇప్పటి వరకు 136 మందిని ఎంపిక చేశారు. మిగతా వారిని కూడా తొందర్లోనే నియమించి, ఎలక్ట్రిక్ బస్సులు నడిపించేందుకు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.వరంగల్ రీజియన్ కు కేటాయించిన 112 బస్సులకు మొత్తం 21 ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. వాటి పనులు వేగంగా కూడా నడుస్తున్నాయి. ఇప్పటికే ఆరు ఛార్జింగ్ పాయింట్లు అందుబాటులోకి రాగా.. వాటికి అవసరమై విద్యుత్ సరఫరా చేసేందుకు సబ్ స్టేషన్ నిర్మాణం కూడా పూర్తయ్యింది. ఇప్పుడున్న 6 పాయింట్ల ద్వారా 30 నుంచి 35 బస్సులు ఛార్జింగ్ చేసుకునే అవకాశం ఉంది. ఒక్క బస్సు ఛార్జింగ్ పూర్తి చేసుకోవడానికి గంటన్నర నుంచి రెండు గంటల సమయం పడుతుందని సిబ్బంది చెబుతున్నారు. ఒక పిన్ తో ఛార్జింగ్ చేస్తే 2 గంటలు, రెండు పిన్ లతో ఛార్జింగ్ చేస్తే గంట సమయం పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. మిగతా 15 ఛార్జింగ్ పాయింట్ల నిర్మాణం కూడా కొనసాగుతోందని ఆఫీసర్లు చెబుతున్నారు.వరంగల్ రీజియన్ కు ముందుగా 86 అలాట్ చేయగా.. ఇటీవల మరో 26 బస్సులు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో వరంగల్ రీజియన్ కు కేటాయించిన సంఖ్య 112కు చేరింది. వాస్తవానికి వరంగల్ రీజియన్ లో ఇటీవల కాలం చెల్లిన బస్సులను తొలగించడం, మహాలక్ష్మి పథకం ఎఫెక్ట్, రూరల్ గ్రామాలకు బస్సు సర్వీసుల పునరుద్ధరణ వల్ల బస్సుల కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 112 ఈవీ బస్సులను కేటాయించడంతో కొంతమేర కొరత తీరే అవకాశం కనిపిస్తోంది.ముందుగా 75 బస్సులను ప్రారంభించేందుకు హనుమకొండలోని కుడా గ్రౌండ్ (హయగ్రీవాచారి గ్రౌండ్)ను సిద్ధం చేశారు. ఈ మేరకు ఆదివారం వీటిని ప్రారంభించాల్సి ఉండగా.. మంత్రుల షెడ్యూల్ ఖాళీ లేని కారణంగా ఈ కార్యక్రమాన్ని సోమవారానికి వాయిదా వేశారు. మొదట డిసెంబర్ 18న మంత్రి పొన్నం చేతుల మీదుగా వీటిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేయగా.. ఆ కార్యక్రమం వివిధ కారణాల వల్ల రద్దయ్యింది.ఆ తరువాత డిసెంబర్ 26 న ప్రారంభించాలని చూసినా కలిసి రాలేదు. ఇప్పుడు జనవరి 5న కూడా ఓపెనింగ్ కు అనుకూలంగా పరిస్థితులు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సోమవారానికి వాయిదా వేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం పూర్తయిన తరువాత ఉమ్మడి వరంగల్ జిల్లా రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు తీయనున్నాయి.

## పార్టీకి, పదవికి ట్రూడో రాజీనామా

**న్యూఢిల్లీ, జనవరి 7, పెన్ పవర్:** కొద్ది గంటల ఊహాగానాల తర్వాత కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో లిబరల్ పార్టీ నాయకత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన పదవికి, లిబరల్ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయనున్నట్లు సంచలన ప్రకటన చేశారు. కొత్త నాయకుడిని ఎన్నుకునే వరకూ ఆయన ప్రధానిగా కొనసాగనున్నారు. ఈ క్రమంలో ఆ దేశ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. కొత్త నాయకత్వాన్ని ఎన్నుకున్న తర్వాత బాధ్యతల నుంచి వైదొలుగుతానని ట్రూడో చెప్పారు. ఆయన రాజీనామాతో దాదాపు 10 ఏళ్ల అధికారానికి ముగింపు పలికినట్లవుతుంది. కాగా.. దేశవ్యాప్తంగా ట్రూడోపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోవడంతో.. లిబరల్ పార్టీ ఎన్నికల్లో గెలిచే అవకాశాలు గణనీయంగా తగ్గిపోయాయి. ఈ క్రమంలో సొంత పార్టీ నేతల నుంచి కొంతకాలంగా డిమాండ్లు వచ్చిన నేపథ్యంలో ఆయన ఈ మేరకు ప్రకటించారు.

## విద్యుత్ షాక్ తో ఇల్లు దగ్ధం.. ఇద్దరు సజీవ దహనం

**బాపట్ల: పెన్ పవర్:**బాపట్ల జిల్లాలోని పర్చూరులో విషాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో ఓ ఇంట్లో మంటలు చెలరేగి అక్కా చెల్లెళ్ళు సజీవ దహనం అయ్యారు. గ్రామంలో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పర్చూరు రామాలయం వీధిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దాసరి వెంకటేశ్వర్లుకు చెందిన ఇంట్లో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. వెంటనే తేరుకున్న తల్లి లక్ష్మీరాజ్యం కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఇంట్లో మంటల్లో చిక్కుకున్న తన ఇద్దరు కుమార్తెలను కాపాడటానికి తల్లి చేసిన ప్రయత్నం విఫలమైంది. దీంతో అగ్నిప్రమాదంలో చిక్కుకుని కదలలేని స్థితిలో వికలాంగురాలిగా ఉన్న అక్క దాసరి నాగమణి (34), చెల్లెలు దాసరి మాధవి లత (30) సజీవ దహనమయ్యారు. కళ్ళ ముందే ఇద్దరు కూతుళ్ళు సజీవ దహనం అవుతుండటంతో తల్లి తల్లడిల్లిపోయింది. గుండెలవిసేలా రోదించింది.
సమాచారం అందుకున్న చీరాల ఫైర్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే మృతి చెందిన అక్కాచెల్లెళ్ళ మృతదేహాలను బయటకు తీసి.. పోస్టుమార్టం నిమిత్తం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుమార్తెలను కాపాడుకోబోయి తీవ్ర గాయాలపాలైన తల్లి లక్ష్మీరాజ్యంను మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పల్నాడు జిల్లాలో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

**పల్నాడు పెన్ పవర్:** పల్నాడు జిల్లాలో గూడ్స్ రైలు మంగళవారం పట్టాలు తప్పింది. దాచేపల్లి మండలం శ్రీనివాసపురం వద్ద ఘటన జరిగింది. విష్ణుపురం రాశి సిమెంట్ ఫ్యాక్టరీకి లోడింగ్ కోసం వెళుతుండగా ప్రమాదం జరిగింది. దాంతో
గుంటూరు- హైదరాబాద్ మధ్య నడవాల్సిన రైళ్ళ ను విజయవాడ మీదుగా దారి మళ్లించారు. రైల్వే పోలీసులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## కూలీలతో వెళుతున్న వాహనం బోల్తా

**వరంగల్ పెన్ పవర్:** ఖానాపురం మండలం చిలకమ్మ నగర్ సమీపంలోని కొత్తగూడ సరిహద్దు ప్రాంతంలో గాదే వాగు మూలమలుపు వద్ద అదుపు తప్పిన తుఫాన్ వాహనం బోల్తా పడింది. ఘటన సమయంలో వాహనం తక్కువ వేగంతో వుండడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాద సమయంలో వాహనంలో 25 మంది ప్రయాణికులు వున్నారు. వీరంతా మధ్యప్రదేశ్ నుండి ఖమ్మం జిల్లా జులురుపాడులో మిర్చి ఏరేందుకు వలస వస్తున్న కూలీలు....

## అనారోగ్యశ్రీగా మార్చిన కూటమి సర్కార్ వైఎస్ షర్మిలా రెడ్డి

**విజయవాడ పెన్ పవర్::** పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఆరోగ్య శ్రీ. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర మానస పుత్రిక ఈ పథకం. ప్రాణాలు తీసే జబ్బొచ్చినా సంజీవని లాంటి ఆరోగ్య శ్రీ పథకాన్ని.. కూటమి సర్కార్ అనారోగ్యశ్రీగా మార్చిందని ఏపీసీసీ ఛీఫ్ షర్మిలా రెడ్డి విమర్శించారు. రూ.3వేల కోట్లు బకాయిలు చెల్లించకుండా, వైద్యసేవలు నిలిచే దాకా చూడటం అంటే.. పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రనే ఇదంతా. ఆరోగ్య శ్రీ పథకానికి మంగళం పాడి.. ప్రజల ఆరోగ్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతుంది. ఆరోగ్యానికి పెద్దపీట అంటూనే కత్తిపీట వేస్తున్నారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తూ.. వదిలించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఆరోగ్య శ్రీ పథకానికి బకాయిలు గత ప్రభుత్వం పెండింగ్ లో పెట్టినవి అయినా. వాటిని చెల్లించే బాధ్యత మీ ప్రభుత్వంపైనే ఉందని అన్నారు.
వెంటనే ఆసుపత్రుల యాజమాన్యాలను చర్చలకు పిలవండి. పెండింగ్ బకాయిలు రూ.3వేల కోట్లు తక్షణం విడుదల చేయండి. ఆరోగ్యశ్రీ సేవలను వెంటనే పునరుద్ధరించి, పథకానికి ఏ లోటూ రాకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## పేదలందరికి ఇళ్లు పేరుతో మోసం.. 3.50 కోట్లు దోపిడీ

గత వైసీపీ ప్రభుత్వంలో నవరత్నాలు పేదలందరికి ఇళ్లు పేరుతో తెనాలి మండలం సంగంజాగర్లమూడిలో దేవస్థానం భూములను నిబంధనలకు విరుద్ధంగా తీసుకొని దేవస్థానంకు చెందాల్సిన రూ. 3.50 కోట్లు కొట్టేశారని దీనివెనుక ఉన్న దోపిడీదారులు వారికి కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని దేవాలయాల భూములను కాపాడాలని బీజేపీ నాయకుడు వై. కామేశ్వరరావు నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ లకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు. ? ప్రకాశం జిల్లా సీపీ పల్లె మండలం కమ్మవారిపల్లె గ్రామానికి చెందిన వేమూరి సుబ్బారావు విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలోని చెరువు ఆనకట్ట, తూములు పూర్తిగా పాడైయ్యాయని అంతే కాకుండా ప్రధాన కాలువ పూడిపోవడంతో చెరువులోకి రావాల్సిన నీరు రావడంలేదని దయ చేసి ఇరిగేషన్ అధికారులు తమ చెరువుపై దృష్టి పెట్టి బాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండలానికి చెందిన డి. సూర్య ప్రకాశ్ విజ్ఞప్తి చేస్తూ.. తమ భూమికి పట్టాధారు పాస్ పుస్తకాలు ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని దయ చేసి తన భూ సమస్యను పరిష్కరించాలని వేడుకున్నాడు.తన తల్లికి 92 సంవత్సరాలని.. గత ప్రభుత్వంలో కరెంట్ బిల్ ఎక్కువ వచ్చిందని పింఛన్ ను కట్ చేశారని.. దయ చేసి తన తల్లికి పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని విజయవా పాయకాపురానికి చెందిన ఎన్. సుబ్బలక్ష్మి విజ్ఞప్తి చేశారు.? ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో తాము అఒఖీఖలుగా పనిచేస్తూ.. తమ ఉద్యోగాలు రెన్యువల్ కోసం ఇటీవల టీడీపీ కేంద్ర కార్యాలయంలో అర్జీ పెట్టుకోగా తమ సమస్య పరిష్కరించడిందని.. పెట్టిన అర్జీకి స్పందించిన తమకు మేలు చేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటామని అర్జీ దారు పద్మతో పాటు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వెంటనే స్పందించి తమ పనిని వేగంగా పూర్తి చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.? నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం రామాపురం గ్రామానికి చెందిన గొడుగులూరి మాలకొండ రాముడు విజ్ఞప్తి చేస్తూ.. మండలంలోని మెట్ట ప్రాంత ప్రజలకు సాగు, తాగునీటికి ఆధారంగా ఉన్న నక్కల గండి రిజర్వాయర్ కు నీరు వచ్చేలా కాలువ పూడిక తీత, లైనింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడికి విజ్ఞప్తి చేశారు.? రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ ఎచ్ ఎంలో 4వ తరగతి ఉద్యోగులుగా వివిధ రకాల క్యాడర్లలో అనేక సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నామని.. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని గత సీఎం మోసం చేశారని.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తమకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు

## ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్



**ఖమ్మం, పెన్ పవర్ జనవరి 07:** పాలేరు మండలంలో రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26వ తేదీ నుంచి రాష్ట్రంలో అమలు చేయబోతున్న రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంజీవ రెడ్డి భవన్ నందు సంబరాలు నిర్వహించాలని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపుమేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల.నాగేశ్వర రావు,రెవెన్యూ గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిల చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్ మాట్లాడుతు రైతు రుణమాఫీ, ధాన్యానికి క్వింటాకు 500 రూపాయలు బోనస్,రైతు భరోసా వంటి కార్యక్రమాలకి ప్రజల్లో మంచి ఆధారణ ఉందని అన్నారు. అనంతరం మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించి ప్రభుత్వానికి మద్దతు తెలిపారు.

పెన్ పవర్
ఖమ్మం

# 'చందు'క్లిక్ జాతీయ ప్రత్యేకం...!





**ఖమ్మం పెన్ పవర్ జనవరి 7:** తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి వ్యక్తిగత ఛాయ చిత్రగ్రాహకుడిగా పనిచేస్తున్న చందుకి జాతీయ స్థాయిలో ప్రత్యేక ఘనత దక్కింది. జనవరి 5,6వ తేదీలలో హుస్సేన్ ఖాన్ ఆధ్వర్యంలో ఒడిస్సా రాష్ట్రంలో సెవెంత్ నేషనల్ వర్క్ షాప్ పేరుతో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో ప్రత్యేక బహుమతి లభించింది.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు,కర్ణాటక, మహరాష్ట్ర,ఒడిస్సా సహా పలు రాష్ట్రాలకు చెందిన 120 మందికి పైగా దిగ్గజ ఫొటోగ్రాఫర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. గిరిజన జాతిలోని బొండాస్ అనే ఓ తెగకు సంబంధించిన వారి సాంప్రదాయ వేషధారణ,నృత్యాలు, జీవన శైలి విధానాలపై ఈ వర్క్ షాపు జరిగింది. ఇందులో దిగ్గజ ఫొటోగ్రాఫర్లతో పోటీపడిన చందూని నిర్వహకులు అభినందిస్తూ'మూసిని సీతారత్నం మెమోరియల్ స్పెషల్ అవార్డు' ను అందించారు.చందుకి జాతీయ స్థాయిలో బహుమతి రావడం పట్ల జిల్లాకు చెందిన ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలుపుతున్నారు.

# ఆశా కార్యకర్తలకు స్థిర వేతనం ఇవ్వాలి: సిఐటియు డిమాండ్



**ఖమ్మం, పెన్ పవర్ జనవరి 7:** ఖమ్మం రూరల్ తెలంగాణ రాష్ట్రంలో ఆశా కార్యకర్తలకు ఫిక్స్ వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని పిఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రమాద బీమా సౌకర్యం 25 లక్షలు ఇవ్వాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్ళపల్లి మోహన్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మంగళవారం రోజు ఖమ్మం రూరల్ మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యం వెంకటాయపాలెం గ్రామంలో ఆశా కార్యకర్తల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో మాట్లాడుతూ గత నెల డిసెంబర్ లో ఆశా కార్యకర్తల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లా కేంద్రాలలో బస్సుయాత్ర చాలా దిగ్విజయంగా జరిగిందని ముగింపు సభ రాష్ట్ర రాజధాని హైదరాబాదులో వేలాది మంది ఆశా కార్యకర్తల తో ముగింపు సభ నిర్వహించారు

ఈ సందర్భంగా ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కొరకు దశల వారి పోరాటాన్ని నిర్వహించాలని ఈ నెల జనవరి 10వ తారీఖున నియోజకవర్గ శాసనసభ్యుల ఇళ్ల ముందు ధర్నాలు విడుదపత్రాలు ఇవ్వాలని 21 నుండి రిలే నిరాహార దీక్షలు ఫిబ్రవరి బడ్జెట్ వరకు కొనసాగించాలని బడ్జెట్ సమావేశాల సందర్భంగా చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాలకు ఆశా కార్యకర్తలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సబ్ సెంటర్ బాధ్యులు మండల అధ్యక్ష కార్యదర్శులు బి మల్లేశ్వరి,బోడా జ్యోతి, జిల్లా నాయకులు సుభద్ర,శ్రీవిద్య,సబ్ సెంటర్ బాధ్యులు ఉమా,పుష్ప,లీలావతి, లలిత,నాగమణి, సుజాత,ఉష,అరుణ, సూరమ్మ,నీలిమ, నాగమణి,కృష్ణవేణి, భాగ్యమ్మ,సరస్వతి, రూపిని,శరబమ్మ, మమత,తిరపమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి వెంట నడుద్దాం

వర్గీకరణను సాధిద్దాం..
రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పిడమర్తి రవి,
మాజీ టీపీసీసీ కార్యదర్శి వక్కలగడ్డ సోమచంద్రశేఖర్








**ఖమ్మం, పెన్ పవర్ జనవరి 7:**ఖమ్మం ప్రెస్ క్లబ్ లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పిడమర్తి రవి, మాజీ టీపీసీసీ కార్యదర్శి వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ లు మాట్లాడుతూ ఫిబ్రవరి 2వ తారీఖున ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద జరిగే మాదిగ యువజన విద్యార్థి గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పిడమర్తి రవి మాట్లాడుతూ మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జిల్లాలో వారీగా వర్గీకరణ వర్గీకరణను చేయాలని అన్నారు. వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 10 నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను నిర్ణయించేది మాదిగ సామాజిక వర్గమేనని పదిమంది ఎమ్మెల్యేలకు గెలుపులో మాదిగలు కీలకంగా ఉన్నారని తెలియజేశారు. ఖమ్మం జిల్లాలో రెండు ఎస్సీ నియోజకవర్గాలు ఉన్నప్పటికీ మాదిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్సీ పదవులను ఖమ్మం జిల్లాకు చెందిన మాదిగలకు వచ్చే విధంగా పదిమంది శాసనసభ్యులు కూడా కృషి చేసి నిబద్ధతను చాటి చెప్పాలని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని అదేవిధంగా నామినేటెడ్ పదవుల్లోనూ రాష్ట్ర జిల్లా కాంగ్రెస్ పదవుల్లోనూ మాదిగ సామాజిక వర్గానికి జనాభా దామాషా ప్రకారం కచ్చితంగా అవకాశాలు కల్పించాలని కోరారు . అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మాదిగ సామాజిక వర్గానికి నమ్మకం ఉందని వర్గీకరణను కచ్చితంగా ఆయన శాస్త్రీయబద్ధంగా చేస్తారని నమ్ముతున్నామని ఆయన తెలియజేశారు . ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ ఉపాధ్యక్షులు మట్టే గురుమూర్తి,తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ నందు నరసింహారావు,తోళ్ల రాకేష్ ,పాతకోటి కరెంట్ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రుపాలెంకు టూరిజం లో ప్రత్యేక స్థానం కల్పించాలి







- ఇండియా టూరిజం మ్యాపులో ఎర్రుపాలెం మండలానికి ప్రత్యేక స్థానం కల్పించేలా మండలాన్ని పర్యాటకంగా అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- అడవులు, గుట్టలను వినియోగిస్తూ ఎకో టూరిజం అభివృద్ధి
- మండలంలోని అడవి, చెరువులే మన ఆస్తి, వాటిని రక్షించాలి
- ఎర్రుపాలెం మండలంలో పర్యటించి జమలాపురం అటవీ పార్క్ కు శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి

**ఖమ్మం, పెన్ పవర్ జనవరి 7:** మధిర నియోజకవర్గం, పరిధిలోని ఇండియా టూరిజం మ్యాపులో ఎర్రుపాలెం మండలానికి ప్రత్యేక స్థానం కల్పించేలా పర్యాటకంగా మండలాన్ని అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు తయారు చేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు.మంగళవారం ఉప ముఖ్యమంత్రి ఎర్రుపాలెం మండలంలో పర్యటించి 5 కోట్ల 83 లక్షలతో చేపట్టిన జమలాపురం అటవీ పార్క్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ,చాలా సంవత్సరాల నుంచి జమలాపురం దేవాలయ పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రజలు ఆకాంక్షించారని, దీనిని దృష్టిలో ఉంచుకొని గతంలో జమలాపురం చెరువు ట్యాంక్ బండ్ గా అభివృద్ధి చేసుకున్నామని, చెరువు కట్ట మీద రోడ్డు వెడల్పు చేసుకుని, గుట్ట మధ్య నుంచి రేమిడిచెర్ల వరకు రోడ్డు వేసుకున్నామని అన్నారు.

ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత వెంటనే జమలాపురం చెరువు, పక్కన కాటేజ్ కోసం పర్యాటక శాఖచే ప్రణాళికలు తయారు చేశామని అన్నారు. అటవీ శాఖ పరిధిలో ఎకో టూరిజం అభివృద్ధి చేయాలని ప్రత్యేకమైన ఆదేశాలు జారీ చేశామని అన్నారు.

అడవులను ధ్వంసం చేయకుండా, దానిని ఆస్వాదిస్తూ బతికేందుకు అవసరమైన కాటేజి అభివృద్ధి చేస్తే టూరిజం పెరుగు తుందని, దీనివల్ల స్థానిక ప్రజలకు ఆదాయం మెరుగు అవుతుందని అన్నారు. టూరిజం అభివృద్ధి కావడం వల్ల ఇక్కడ వ్యాపారాలు బాగా జరుగుతాయని అన్నారు. 6 నెలల్లో అటవీ పార్క్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అన్నారు.

బుచ్చిరెడ్డి పాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో ఇద్రీనమ్మ చెరువు దగ్గర కూడా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తూ, నాగార్జునసాగర్ నుంచి లింక్ చేసి అక్కడ ఎప్పుడూ నీళ్ళు ఉండే విధంగా, కాటేజ్, పార్క్, భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. అంతర్జాలం ద్వారా ప్రచారం చేస్తే ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి ఆహ్లాదకరంగా ఇక్కడ గడుపుతారని అన్నారు.

గతంలో త్రాగునీటి సరఫరా పనులు చేసే సమయంలోనే ఐదు ఎకరాలు అధికంగా స్థలం సేకరించామని, ప్రస్తుతం ఆ స్థలం పార్క్ పర్యాటక ప్రాంత అభివృద్ధికి ఉపయోగపడుతుందని అన్నారు.

లక్ష్మీపురం నుంచి వచ్చే ప్రజలకు అక్కడ రింగ్ రోడ్డు మాదిరి ఉండేలా చేస్తున్నామని అన్నారు.

జమలాపురం వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కూడా ఆస్కారం ఉంటుందని అన్నారు. జిల్లాలో మారుమూల మండలం ఎర్రుపాలెం అని,ఇక్కడ అధికంగా మనకు ప్రకృతి పరంగా అందమైన గుట్టలు అడవి ఉంది కాబట్టి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసుకోవాలని, దీనివల్ల ఉద్యోగాలు, సంపద వస్తాయని అన్నారు.

మన మండలానికి వచ్చే పర్యాటకులు అతిధులతో సమానమని, వారిని గౌరవంగా చూసుకుంటే మన ప్రాంతం అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని, ఇక్కడికి వస్తే బాగా చూసుకుంటారు అనే పేరు రావాలని అన్నారు. మండలంలోని అడవి, చెరువులే మన ఆస్తి అని వీటిని మనం సంరక్షించుకోవాలని ఉప ముఖ్యమంత్రి అన్నారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ,డిజైన్ నుంచి తుది అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన వరకు ప్రజలకు ఉపయోగపడే విధంగా, జమలా పురం ఆలయానికి వచ్చే భక్తులు ఆహ్లాదంగా గడిపేలా ఉపముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ వహించారని అన్నారు. పార్క్ శంకుస్థాపన కార్యక్రమానికి చాలా రోజుల నుంచి అధికారులు పడిన శ్రమ ఫలితమని అన్నారు. ఖమ్మం నగరంలో వారానికి దాదాపు 5 వేల మంది ప్రజలు వెలుగు మట్ల అర్బన్ పార్క్ కు వచ్చి సరదాగా గడుపుతున్నారని అన్నారు. ప్రకృతిని కాపాడటం మన సంస్కృతిలో భాగమని, ప్రకృతితో కలిసి, మెలిసి అభివృద్ధి సాధించాలని అన్నారు.

కార్యక్రమంలో చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమా నాయక్ మాట్లాడుతూ, అటవీని సంరక్షిస్తూ ఇక్కడ ఆహ్లాదకరమైన పరిస్థితులు ఏర్పాటు చేసేందుకు అర్బన్ పార్క్ కార్యాచరణ తయారు చేయడం జరిగిందని అన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ పార్క్ ఉండే విధంగా నిర్వహిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డా.పి. శ్రీజ, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు,ఎఫ్డివో మంజుల, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







# పెద్ద ఆసుపత్రికి ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు

- ఖమ్మం ఎంపీ మానవత్వం..
- పెద్ధాస్పత్రిలో ఫ్రీజర్ల ఏర్పాటుకు రూ.8లక్షలు మంజూరు చేసిన రామసహాయం రఘురాం రెడ్డి
- వివరాలు వెల్లడించిన కాంగ్రెస్ జిల్లా నేత కొప్పుల చంద్రశేఖర్



**ఖమ్మం, పెన్ పవర్ జనవరి 7:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి మార్చురీలో శీతల శవ పేటికలు (ఫ్రీజర్ల) ఏర్పాటుకు ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి రూ.8 లక్షలు మంజూరు చేశారు.ఈ మేరకు కాంగ్రెస్ జిల్లా నేత కొప్పుల చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది అక్టోబర్ 22వ తేదీన ఖమ్మం ఎంపీ పెద్దాస్పత్రిని సందర్శించిన సందర్భంలో ఫ్రీజర్ల కొరత ఉందని సూపరింటెండెంట్ ద్వారా తెలుసుకున్నారు.దీంతో ఆయన స్పందించి.. ఫ్రీజర్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఈ క్రమంలో ఆరు ఫ్రీజర్ల కొనుగోలుకు ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి .8 లక్షల రూపాయలను కేటాయించారు. సత్వరమే సమకూర్చాలని తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్ కుమార్, అధికారులు, వైద్య సిబ్బంది ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

# గులాబీ కమలంగా మారుతుందా...



**హైదరాబాద్, జనవరి 7, పెన్ పవర్:** పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటిన బీజేపీ ఇప్పుడు పార్టీ సంస్థాగత మార్పులపై దృష్టి పెట్టింది. భవిష్యత్తు కార్యక్రమాలకు ప్రణాళికలను రూపోందించడంపై ఫోకస్ చేస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మిషన్ 90 అంటూ.. తొంబై స్థానాలు సాధించడమే లక్ష్యంగా, బీసీ ముఖ్యమంత్రి నినాదంతో మందుకు వెళ్లిన కాషాయ పార్టీ కేవలం ఎనిమిది స్థానాలకే పరిమితం అయ్యింది. సేమ్ సీన్ పార్లమెంట్ ఎన్నికల్లో కూడా రిపీట్ అయ్యింది.వికసిత్ భారత్ లక్ష్యంగా, ఫిర్ ఎక్ బర్ మోడీ నినాదంతో, తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాల్లో డబుల్ డిజిట్ స్థానాలు సాధించే దిశగా ఎన్నికల బరిలో దిగిన బీజేపీ ఎనిమిది స్థానాలకు పరిమితం అయ్యింది. అదటుంచుతే ప్రస్తుతం గత ఎన్నికల లక్ష్యాలను, గెలుపోటములపై సంస్థాగతంగా అంతర్మథనం చేసుకునే పనిలో పడింది ఆ పార్టీ.. అంతేకాదు భవిష్యత్తులో బలోపేతం అయ్యే మార్గాలను అన్వేషించడంపై కూడా ఫోకస్ పెడుతోందంట.రాష్ట్రంలో ఎన్నికలు గడిచి ఏడాది పూర్తయింది. ఇక వచ్చే నాలుగేండ్లలో ఎదురయ్యే సవాళ్లను ఎదురుకునేందుకు కమలదళం వ్యూహాలను రచిస్తోంది. గత ఎన్నికల్లో అనుకున్న లక్ష్యాలను సాధించనప్పటికి ఎనిమిది పార్లమెంట్ స్థానాలను సాధించడంతో ఆ పార్టీలో కొంత ఉత్సాహం కనిపిస్తుంది. అదే జోష్ రానున్న అసెంబ్లీ ఎన్నికల వరకు నడిపించగలిగితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా బీజేపీని నిలబెట్టోచ్చని, కచ్చితంగా రాష్ట్రంలో బలమైన పార్టీగా ఎదుగొచ్చనే అంచనాలలో కాషాయ దళాలున్నట్టు తెలుస్తోంది.అందులో భాగంగానే జాతీయ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు సంస్థాగతంగా పార్టీని మార్పులు చేసే ప్రయత్నంలో పార్టీ వర్గాలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. అందులో భాగంగానే జాతీయ స్థాయి నుంచి, బూత్ స్థాయి వరకు సంస్థాగతంగా పార్టీ ఎన్నికలు జరుపుకుంటుంది. బలమైన నేతలకు పార్టీ పగ్గాలు అప్పజెప్పేందుకు అధిష్టానం ప్రయత్నం చేస్తోంది.దేశంలో, రాష్ట్రంలో బలమైన శక్తిగా నిలబడాలంటే బలమైన నేతను అధ్యక్ష పదవిపై ఉంచాలనే యోచనలో అధిష్టానం ఉందంట. అందులో భాగాంగనే తెలంగాణలో అధ్యక్ష్య పీఠాన్ని బలమైన సామజిక వర్గానికి చెందిన నేతకు ఇవ్వాలని అధిష్టానం చూస్తున్నప్పటికి, ఆ పదవికి మాత్రం డిమాండ్ చాలా ఉంది. రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం అరడజను మంది నేతలకు పైగా పోటీ పడుతూ ఎవరికి వారే తమతమ ధీమాను వ్యక్తపరుస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.ఆ క్రమంలో అధిష్టానం అధ్యక్ష పీఠం ఎవరికి కట్టబెడుతోందనేది సస్పెన్స్ నెలకొంది. ఈ మాసం చివరి కల్ల అధ్యక్ష ఎంపిక ప్రక్రియ పూర్తి నూతన అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. అధ్యక్ష ఎన్నిక, నియామకం అనంతరం రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయడానినికి ఇతర పార్టీల నుంచి భారీగా చేరికలను ప్రోత్సహించాలని కాషాయ నేతలు భావిస్తున్నారంట.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ని ఎదుర్కోవడానికి బీఆర్ఎస్ ను గ్రౌండ్ లేవల్లో ఖాళీ చేయడానికి కాషాయ నేతలు స్కెచ్ గీస్తున్నారంట. అందుకే ప్రధానంగా బీఆర్ఎస్ ను టార్గెట్ చేసుకుని భవిషత్తుకు మార్గాలు వేసుకోవాలనే యెచనలో కాషాయ నేతలున్నట్టుగా తెలుస్తోంది. అంతేకాదు వచ్చే స్థానిక ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని, మంచి మేజారిటీ స్థానాలు సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. మొత్తం మీద గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అనుకున్న లక్ష్యాలను అందుకోనప్పటికి? ఊహించని దానికంటే ఓటింగ్ పర్సెంటేజీని పెంచుకొని జోష్ మీదున్న కాషాయ నేతలు ఆ దిశగా ఎంతవరకు సక్సెస్ అవుతారో చూడాలి.

# గులాబీ డైవర్షన్ పాలిటిక్స్...

**హైదరాబాద్, జనవరి 7, పెన్ పవర్:** ప్రస్తుతం రాజకీయ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య డైవర్ట్ పాలిటిక్స్. మీడియా అడిగే ప్రశ్నలకు తప్పించుకునేందుకు ఎదుటివారిపై బురద జల్లడం కామన్గా మారింది. ప్రస్తుతం తెలంగాణలో అదే జరుగుతోంది. ఫార్ములా ఈ కారు రేస్ కేసు నమోదుతో కేటీఆర్ ఇమేజ్ అమాంతంగా పడిపోయిందన్నది నేతల మాట. విచారణకు హాజరై మరింత దారుణంగా ఉంటుందని గమనించారాయన. ఈ క్రమంలో ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఫార్ములా కేసులో తొలిసారి ఏసీబీ ముందు విచారణకు హారవుతున్నారు కేటీఆర్. ఆయన కచ్చితంగా విచారణకు హాజరు కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. విచారణకు వెళ్లకుంటే దాన్ని షాకుగా చూపించి న్యాయస్థానంలో బెయిల్ రద్దు చేసే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ వ్యవహారాన్ని డైవర్ట్ చేసేందుకు పార్టీ నుంచి కొత్త పల్లవి ఎత్తుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపట్టాలని ప్లాన్ చేసినట్టు పార్టీ వర్గాల నుంచి ఓ ఫీలర్ బయటకు వచ్చింది.ఇదిలావుండగా మీడియా ముందుకొచ్చిన కేటీఆర్.. మనసులో ఏ ముందో చెప్పాల్సిన నాలుగు ముక్కలు చెప్పేవారు. ఆ తర్వాత వివిధ ఛానెళ్లతో మాట్లాడారు. పార్టీలో జరుగుతున్న అంతర్గత కలహాలపై మీడియా ప్రశ్నకు నేరుగా సమాధానం ఇవ్వకుండా తప్పించుకునే ప్రయత్నం చేశారు. పనికిమాలిన వారు ఇలాంటి స్లోగన్స్ చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తామంతా పని చేస్తున్నామన్నారు. చివరి వరకు ఆయనే ముఖ్యమంత్రిగా ఉంటారని చెప్పకనే చెప్పేశారు. కేసీఆర్ మీ నాయకుడు అన్నప్పుడు.. అసెంబ్లీకి ఎప్పుడు వస్తున్నారు అనే ప్రశ్నకు సరిగా సమాధానం ఇవ్వలేదు.బీఆర్ఎస్ పార్టీలో ఏదో జరుగుతుందన్నది వాదన మరింత బలపడింది. ఈ మధ్యకాలం లో కేటీఆర్ మాటలు సరిగా లేవన్నది కొందరి మాట. ఒకప్పుడు హుందాగా ప్రవర్తించే వారని, ఇప్పుడదేమీ కనిపించలేదని అంటున్నారు. గతంలో పొరుగు రాష్ట్రం ఏపీలో వైసీపీ నేతలు ఇలాగే మాట్లాడేవారని, దాన్ని ఫాలో అవుతున్నారా? అంటూ సోషల్ మీడియాలో రకరకాల కామెంట్స్ పడిపోతున్నాయి.

# అడ్డంగా బుక్కైన కేటీఆర్

**హైదరాబాద్, జనవరి 7, పెన్ పవర్:** ఫార్ములా ఈ కారు రేసులో కీలక విషయాలు బయటపెట్టింది తెలంగాణ ప్రభుత్వం. రేసు నిర్వహించిన గ్రీన్ కో సంస్థ ద్వారా బీఆర్ఎస్కు కోట్లాది రూపాయల లబ్ది చేకూరినట్టు వెల్లడించింది. ఎన్నికల బాండ్ల ద్వారా ఆ పార్టీకి రూ. 41 కోట్లు లబ్ది చేకూరినట్టు తేల్చింది. దీంతో ఫార్ములా ఈ కారు రేసు వ్యవహారం మరో మలుపు తిరిగింది.ఫార్ములా ఈ కారు రేసు వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. ఈ కేసులో ఏసీబీ విచారణకు దుమ్మా కొట్టారు మాజీ మంత్రి కేటీఆర్. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం సంచలన విషయాలు బయటపెట్టింది. ఫార్ములా- ఈ రేస్ నిర్వహించిన గ్రీన్ కో కంపెనీ ద్వారా బీఆర్ఎస్ పార్టీకి కోట్లాది రూపాయల లబ్ధి చేకూరిందని తేల్చేసింది.బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల బాండ్ల రూపంలో రూ. 41 కోట్లు చెల్లించింది గ్రీన్ కో సంస్థ. బీఆర్ఎస్ పార్టీకి గ్రీన్ కో, దాని అనుబంధ సంస్థలు ఏకంగా 41 సార్లు ఎన్నికల బాండ్ల రూపంలో ముడుపులు చెల్లించింది. ఆ జాబితాను బయటపెట్టింది ప్రభుత్వం.రేస్కు సంబంధించిన చర్చలు మొదలైనప్పటి నుంచి బాండ్లను కొనుగోలు చేసింది గ్రీన్ కో సంస్థ. 2022 8 ఏప్రిల్ నుంచి అక్టోబర్ 10 మధ్య ఆయా బాండ్లను కొనుగోలు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ప్రతిసారి కోటి విలువ చేసే బాండ్లు కొనుగోలు చేసింది గ్రీన్ కో కంపెనీ.ఈ వ్యవహారానికి కౌంటర్ చేయలేక బీఆర్ఎస్ తర్జనభర్జన పడుతోంది. చివరకు మీడియా చిట్ చాట్లో కొన్ని విషయాలు బయటపెట్టారు కేటీఆర్. గ్రీన్ కో ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చింది 2022 ఏడాది మాత్రమేనని చెప్పిన ఆయన, ఫార్ములా- ఈ రేసు జరిగింది 2023లో జరిగిందన్నారు. గ్రీన్ కో సంస్థ ఎలక్టోరల్ బాండ్లు కాంగ్రెస్, బీజేపీకి కూడా ఇచ్చిందని చెప్పే ప్రయత్నం చేశారు.పార్లమెంట్ ఆమోదించిన ఎలక్టోరల్ బాండ్లు ఇవ్వడం అవినీతి ఎలా అంటారన్నది కేటీఆర్ మాట. తెలంగాణ ప్రభుత్వం బయటపెట్టిన వివరాలతో బీఆర్ఎస్ మరింత ఇరుకున పడిపోయినట్టు



కనిపిస్తోంది. ఈ కేసు నుంచి కేటీఆర్ బయటపడడం కష్టమనే వాదన మరింత బలంగా మారిందని అధికార పార్టీ నేతల మాట.

## ఢిల్లీ లో ఏఐసీసీ కార్యాలయం వద్ద రైతు భరోసా పోస్టర్ల కలకలం

**న్యూఢిల్లీ పెన్ పవర్:** రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చి వరంగల్ డిక్లరేషన్ పేరుమీద తెలంగాణ రైతులకు ఎకరానికి 15000 రూపాయలు చొప్పున ఇస్తామని ప్రకటించి, కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత 2024 సంవత్సరంలో రైతులకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడం, ఇటీవల సీఎం రేవంత్ యూటర్న్ తీసుకుంటూ ఎకరాకు 15000 ఇవ్వమని ప్రకటించడంపై ఏకంగా ఏఐసీసీ కాంగ్రెస్ కార్యాలయం వద్ద "కాంగ్రెస్ రైతు భరోసా యూటర్న్" పేరుతో పోస్టర్లు వెలిసాయి.

## శ్రీతేజ్ ను పరామర్శించిన అల్లు అర్జున్

**హైదరాబాద్ పెన్ పవర్:** టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ను పరామ ర్శిం చారు.బన్నీ లేటెస్ట్ మూవీ పుష్ప2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ దగ్గర జరిగిన తొక్కిసాట లో రేవతి అనే మహిళ చనిపోయిం ది. ఆమె 8ఏళ్ల కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుప త్రిలో వెంటిలేటర్ పై చికిత్స పొందు తున్నాడు. గత 35రోజులుగా వైద్యులు బాలుడికి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు లాయర్ల సలహా ప్రకారం బాధిత కుటుంబాన్ని పరామర్శించని హీరో అల్లు అర్జున్ ఇప్పుడు స్వయంగా కలిసి వారిని పరామర్శించారు.

## వీడని పాప అదృశ్యం కేసు

**కరీంనగర్ పెన్ పవర్:** వేములవాడ లో గత నెల 23న అదృశ్యమైన చిన్నారి ఆచూకీ ఇంకా లభించలేదు. ఐదుగురు సభ్యులు గల మహిళలు పాపను తీసుకెళ్ళిన విజువల్స్ సిసి కెమెరా లో రికార్డు అయింది. పోలీసులు సిసి కెమెరా ఫుటేజ్ ని విడుదల చేసారు. జగిత్యాల జిల్లా కోడిమ్యాల మండలం చింతలపల్లి కి చెందిన మతిస్థిమితం సరిగా లేని తల్లి లాస్య నాలుగేళ్ల కూతురు అద్విత తో 23న వేములవాడ కు వచ్చింది. మతిస్థిమితం సరిగా లేకపోవడం పాప గురించి తల్లి చెప్పలేక పోయింది. పాప కుటుంబ సభ్యులు ఆలస్యంగా పోలీసులకు డిసెంబర్ 30న పిర్యాదు చేసారు. అప్పటి నుంచి వెతికినా ఆచూకీ లభించలేదు. సిసి ఫుటేజీల ఆధారంగా అనుమానిత మహిళల చిత్రాలను పోలీసులు విడుదల చేసారు. మూడు పోలీసు బృందాలు పాపకోసం గాలిస్తున్నాయి.

## మియాపూర్ లో మేయర్ అకస్మిక తనిఖీలు

**హైదరాబాద్ జనవరి 7 పెన్ పవర్:** చందా నగర్ సర్కిల్ మియపూర్ డివిజన్ లో మంగళ వారం ఉదయం ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ తో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేసారు. కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, పలు సమస్యలను మేయర్ దృష్టికి తెచ్చారు. మేమేరి గార్డెన్ వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటు లోకి తేవాలని అధికారులను మేయర్ ఆదేశించారు. మక్త చెరువు లేక్స్ లో వ్యర్థాలు ను తొలగించక పోవడం తో రాంకి సంస్థ నిర్వాహకుల పై సిరియస్ అయ్యారు. శానిటేషన్ పై అసంతృప్తి వ్యక్తం చేసారు. శానిటేషన్ మెరుగు పరచాలని జోనల్ కమిషనర్ కు ఆదేశించారు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి.

## గ్రీన్ స్కిల్లింగ్పై స్వనీతి ఇనిషియేటివ్ తో ఒప్పందం

### గ్రీన్ ఎనర్జీ రంగంలో యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

### మంత్రి లోకేష్ సమక్షంలో స్వనీతి, ఎపిఎస్ఎస్ డిసి ఎంఓయు




**అమరావతి పెన్ పవర్:** రాష్ట్రంలో గ్రీన్ స్కిల్లింగ్ అభివృద్ధి కోసం స్వనీతి ఇనిషియేటివ్ సంస్థతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ంఖూూఆఅ) కీలక ఒప్పందం చేసుకుంది. ఉండవల్లి నివాసంలో రాష్ట్ర మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఈ మేరకు ఎంఓయు కుదిరింది. ప్రముఖ సామాజిక సంస్థ అయిన స్వనీతి ఇనిషియేటివ్ రాష్ట్రంలో పౌరసేవలను మెరుగుపర్చి, అట్టడుగువర్గాల అభివృద్ధికి అవసరమైన విధానాల రూపకల్పన చేస్తుంది. పరిశోధన, డేటా, పబ్లిక్ సర్వీస్ డెలివరీలో అనుభవం కలిగిన స్వనీతి ఇనియేటివ్ సంస్థ సమాజంలో వెనుకబాటుకు గురైన వారి జీవితాల్లో మార్పు కోసం కృషిచేస్తుంది. స్కిల్లింగ్కు సంబంధించి స్కిల్ డెవలప్మెంట్ వర్క్కు పూర్తిస్థాయి మద్దతు ఇస్తుంది. కీలకమైన రంగాలు, పరిశ్రమలను గుర్తించి, స్థిరమైన జాబ్ మార్కెట్ను ప్రోత్సహించడంపై దృష్టి సారిస్తుంది. ఈ కార్యక్రమంలో స్వనీతి ఇనిషియేటివ్ ట్రస్టీ ఉమా భట్టాచార్య, స్టేట్ కన్సల్టెంట్ శివ ప్రసాద్, అసోసియేట్ తేజ సరియం, పాఠశాల విద్య, స్కిల్ డెవెలప్మెంట్ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ గణేష్ కుమార్, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్ కుమార్ పాల్గొన్నారు.గ్రీన్ స్కిల్లింగ్ కోసం ఆర్థికేతర సాంకేతిక సహకారం, సేవలను అందించేందుకు స్వనీతి ఇనిషియేటివ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ంఖూూఆఅ) నడుమ అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం స్వనీతి ఇనిషియేటివ్ సంస్థ వచ్చే 4నెలల్లో పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించి నైపుణ్యాభివృద్ధి వ్యూహం ముసాయిదాను రూపొందించి, వ్యూహం అమలుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేస్తుంది. ఇందుకోసం రెన్యువబుల్ ఎనర్జీ సెక్టార్ కోసం స్కిల్ ల్యాండ్ స్కేప్ అసెస్ మెంట్ చేస్తుంది. కీలకమైన వాటాదారులతో (పరిశ్రమ, పరిశ్రమ సంఘాలు, క్లస్టర్ సంఘాలు, శిక్షణా సంస్థలు – ఐఐటిలు, ఐటిఐ, నైపుణ్య విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్ కళాశాలలు మొదలైనవి.) సంప్రదింపులు జరిపి నివేదిక రూపొందిస్తుంది.జర్మనీ, జూ బృందాలు, సెక్టార్ నిపుణులు, విజయవంతమైన కేసులపై అవగాహనకు సమావేశాలు నిర్వహిస్తుంది. గ్రీన్ ఎనర్జీ రంగ నిపుణుల ఆలోచనలను పంచుకునేందుకు కీలకమైన భాగస్వాములతో వర్క్షాప్ లు నిర్వహిస్తుంది. కీలక వాటాదారులతో భాగస్వామ్యంతో వ్యూహాన్ని ఖరారు చేస్తుంది. ంఖూూఆఅ సంస్థ తమ ప్రధాన కార్యాలయం నుండి పని చేసే స్వనిధి బృందానికి ప్రత్యేకంగా నైపుణ్య గణన, ఇన్ సైట్ ఇన్ఫర్మేషన్, గ్రీన్ స్కిల్లింగ్ అభివృద్ధికి సంబంధించిన ఇతర సమాచారం అందిస్తుంది. టెక్నికల్ కన్సల్టెంట్లు ంఖూూఆఅ తాడేపల్లి కార్యాలయంలో పని చేయడానికి అవసరమైన స్థలాన్ని అందిస్తుంది. అనంతపురం, చిత్తూరు, వైఎస్ఆర్ కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లోని గ్రీన్ ఎనర్జీకి సంబంధించిన ప్రభుత్వ శాఖల విశ్లేషణలు, వారితో సంప్రదింపుల కోసం సంబంధిత ప్రభుత్వ శాఖల యాక్సెస్ ఇచ్చి, సంబంధిత సమాచారాన్ని అందిస్తుంది.

## తెలంగాణలో పెరిగిన చలి తీవ్రత



హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగింది. మెదక్లో 7.8 డిగ్రీలు, పటాన్చెరులో 11, రాజేంద్రనగర్లో 11, ఆదిలాబాద్లో 11.2, హకీంపేట్లో 14.3 డిగ్రీలు, నిజామాబాద్లో 15.2, దుండిగల్లో 15.3 డిగ్రీలు,హైదరాబాద్లో 15.9, హనుమకొండలో 16 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పెన్ పవర్

వరంగల్
వరంగల్ అర్బన్ | వరంగల్ రూరల్

## టీడీఆర్ లెక్క 150 కోట్లపైనే




**తిరుపతి, జనవరి 7, పెన్ పవర్:** తిరుపతి నగర పాలక సంస్థకు ఏకంగా 150కోట్లు రూపాయలు నష్టం చేకూర్చారని విజిలెన్స్ నివేదికలో తేల్చింది. మాస్టర్ ప్లాన్ రహదారుల కోసం సేకరించిన అస్తులను కమర్షియల్ గా మార్చి వాటి విలువ పెంచి అయిన వారికి ఇష్టానుసారం టీడీఅర్ బాండ్స్ ఇచ్చారని దీంతో నగర పాలక సంస్థ నష్ట పోయిందని నివేదిక తేల్చి చెప్పింది. మాస్టర్ ప్లాన్ రహదారుల పేరుతో భూమన గ్యాంగ్ చేసిన దందా బయటపడిందని అంటున్నారు. ఈ స్కాంలో భూమనతో పాటు పలువురు వైసీపీ నేతలు, ప్రభుత్వం యంత్రాంగం మెడకు ఈ ఉచ్చు బిగుసుకోవడం ఖాయమంట.వైసీపీ పాలకులు అయిన వారికి ఇష్టానుసారం ప్రభుత్వ ధనాన్ని దోచి పెట్టారు. వివిధ పథకాల పేరుతో తమ వారికి అయాచిత లబ్ధి చేకూర్చారు. దీంతో పాటు తాము లబ్ధిపొందారు..ఈ విధంగా జరిగింది తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణం.. మొత్తం మాస్టర్ ప్లాన్ రహదారుల్లో ఏకంగా 104 రహదారుల నిర్మాణం చేయాలని ప్రతిపాదనలు చేశారు. 2003 సంవత్సరం చివర్లో హడావుడిగా నిర్మాణం పనులు నెత్తికెత్తుకున్నారు.. ఇందులో బాగంగా 23 రహదారుల నిర్మాణం పూర్తి చేసారు.అయితే వాటి కోసం 1,389 అస్తులను సేకరించారు. వారికి పరిహారం ఇవ్వడానికి నిధులు లేక పోవడంతో టీడీఅర్ బాండ్ల ఇవ్వడం మొదలు పెట్టారు. అక్కడే అసలు మతలబు జరిగింది. . ఆ రహదారులు వేస్తుంది తమ అస్తుల విలువ పెంచుకోవడానికే అని అప్పట్లో విమర్శలు వచ్చాయి.. దానికి తగ్గట్లు గానే వైసీపీ హయాంలో రహదారులు వేసిన ప్రాంతాలలో ఆ పార్టీ కీలక నేతలు అయిన సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డితో పాటు స్థానిక నేతలు, కార్పొరేటర్ల , చివరికి గల్లీ నేతల అస్తులు కూడా ఉన్నాయి. కొత్త రహదారులు వేయడం పుణ్యమాని వాటి ధరలు పెరిగి పోయాయి.ఇక అదే సమయంలో సదరు నాయకులు తమ అస్మదీయులకు న్యాయం చేయాలని భావించారు. అందులో భాగంగా రెసిడెన్షియల్ ఏరియాలను సైతం కమర్షియల్గా మార్చి వేశారు.. అందుకు గాను తమ వారితో అప్పటి కప్పుడు రహదారి వేస్తున్న ప్రాంతాలలో కమర్షియల్ షెడ్స్ వేయించడం లాంటి కార్యకలాపాలు చేయించారు. చిన్న పాటి హోటల్స్ పెట్టించారు. వాటిని చూపిస్తూ అ ఏరియా మొత్తం కమర్షియల్ లెక్కలతో రికార్డులు తయారు చేయించారు. ఆ విధంగా వారు చేయడంతో పెద్ద ఎత్తున నగర పాలక సంస్థ కు ఖజానాకు నష్టం వాటిల్లింది. దానికి తోడు రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులతో మార్కెట్ వాల్యు పెంచి అంచనాలు వేయించారు.మాస్టర్ ప్లాన్ రహదారుల కోసం మొత్తం 1,389 అస్తులను సేకరించగా అందులో టీడీఅర్ బాండ్ల జారీకి అర్హమైనవని 1,149గా తేల్చారు. ఎన్నికల లోపే హడావుడిగా 442 బాండ్ల ను జారీ చేశారు. ఇంకా 707 ఆస్తులకు సంబంధించి బాండ్ల ను జారీ చేయాల్సి ఉంది. అప్పట్లోనే వీటి పైన టీడీపీ పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించడంతో వాటిపై అప్పటి మున్సిపల్ ప్రధాన కార్యదర్శి అయిన లక్ష్మి విచారణకు అదేశించారు. దాంతో మిగతా స్థలాలకు టీడీఆర్ బాండ్లు జారీ చేయలేక పోయారు. జారీ చేసిన టీడీఆర్ బాండ్ల విలువ 850 కోట్లు కాగా అందులో అనవసరంగా 150 కోట్లు పెంచారని .. వాస్తవ విలువ 700 కోట్లుగా విజిలెన్స్ తేల్చి చెప్పింది.మొత్తం వ్యవహారంలో కీలక పాత్ర పోషించింది మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్రెడ్డేనంట.. భూమనతో పాటు ఆయన కూమారుడు మాజీ డిప్యూటీ మేయర్, గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన భూమన అభినయ్రెడ్డితో పాటు అప్పట్లో పనిచేసిన నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, టౌన్ ప్లానింగ్ , నగర పాలక సంస్థ రెవెన్యూ అధికారులు దందా మొత్తం నడిపించారని అంటున్నారు. భూమన కరుణాకరరెడ్డి పర్సనల్గా తీసుకుని నడిపించిన ఈ తతంగంలో ఎవరి వాటాలు వారికి ముట్టాయంటున్నారు.మొత్తం వ్యవహారంపై విజిలెన్స్ విచారణ జరుగుతుండటంతో మరింత మంది పాత్ర బయటపడే అవకాశముందంట. దీనికి సంబంధించి తమ కంటే రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బంది ప్రధానంగా ఇరుక్కు పోతారని? తమకేమి నష్టం లేదని తిరుపతి టౌన్ ప్లానింగ్ అధికారులు అంతర్గత సంభాషణల్లో అంటున్నారంట.. మొత్తం మీద మున్సిపల్ శాఖ సైతం దీనిపై అనంతపురం అర్జేడీ విశ్వనాథ్ అధ్వర్యంలో ఎంక్వయిరీ చేయించింది. ఆ నివేదిక కూడా బయట పడితే ఈ కుంభకోణంలో తిమింగలాలతో పాటు చిన్నా చితకా చేపల భాగోతం కూడా బయటపడుతుందంటున్నారు.

## ముందే ముంగిట్లోకి ముంజులు, మామిడిపండ్లు


**విజయవాడ, జనవరి 7, పెన్ పవర్::** ఏపీలో ఓ ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది.ఎప్పుడో వేసవి కాలం అంటే ఏప్రిల్ , మే నెలలో కనిపించే తాటి ముంజలు, మామిడి పండ్లు.. మూడు నెలలు ముందుగానే దర్శనమిచ్చాయి. విచిత్రంగా డిసెంబర్లోనే తాటి ముంజలు, మామిడి పండ్లు అందుబాటులోకి రావడం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. విజయవాడలో తాటి ముంజలు, మామిడి పండ్లను రోడ్లు పక్కన ఉంచి విక్రయిస్తున్నారు. . ఇదంతా చూసి కొందరు ఆశ్చర్యపోతున్నారు. మరికొందరు వీటిని కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్తున్నారు.వాస్తవానికి ఏటా వేసవికాలంలో, ఏప్రిల్ నెలలో తాటిముంజలు సీజన్ ఉంటుంది. జనాలు ఎండ తీవ్రతను నుంచి ఉపశమనం పొందేందుకు కొంటుంటారు. కానీ ఇప్పుడు రోడ్ల పక్కన డిసెంబర్లోనే తాటి ముంజలు కనిపిస్తున్నాయి. విజయవాడలోని బందరు రోడ్డులో గంగూరు సమీపంలో తాటిముంజలను డజను రూ.100 నుంచి రూ.120కి విక్రయిస్తున్నారు. జనాలు కూడా తాటి ముంజల్ని కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది మాత్రం డిసెంబర్లో తాటి ముంజలు ఏంటని చర్చించుకుంటున్నారు.మరోవైపు విజయవాడలోనే మామడి పండ్లు కూడా రోడ్ల పక్కన కనిపిస్తున్నాయి. నెల్లూరు జిల్లా ఉలవపాడు ప్రాంతంలో తోటల్లోని రెండు వేల చెట్లలో మామిడి పంట దిగుబడికి వచ్చిందట. మొత్తం నాలుగు టన్నుల మామిడి పండ్లను విజయవాడ కృష్ణలంక సమీపంలో రోడ్డుపై వీటిని అమ్ముతున్నారు. వీటిని కిలో రూ.250 నుంచి రూ.300కు విక్రయిస్తున్నారు. జనాలు కూడా మామిడి పండ్లను కొనుగోలు చేస్తున్నారు. అయితే తాటి ముంజలు, మామిడి పండ్లు ఎలా వచ్చాయని ఆరా తీస్తే.. అవి పైరు కాపు ఉత్పత్తులని.. వందల చెట్లలో కొన్ని ఇలా ముందే కాపునకు వస్తాయని రైతులు చెబుతున్నారు.అందుకే ముందే ఇలా పంట దిగుబడి వచ్చిందంటున్నారు.వాస్తవానికి మామడి పండ్లు, తాటి ముంజలు ఏప్రిల్ నెలలో అమ్మకాలు చేస్తారు. వేసవి కాలంలో ఎక్కువగా పంట దిగుబడి ఉంటుంది. మామిడి పండ్లు ఆగస్టు నెల వరకు దొరకుతాయి.. ఆ తర్వాత పునాస మామిడిపండ్లు ఉండేవి. కానీ విచిత్రంగా తాటి ముంజలు మాత్రం డిసెంబర్లో రావడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# దిల్ రాజు... సయోధ్య యత్నాలు...



**హైదరాబాద్, జనవరి 7, పెన్ పవర్:** ప్రముఖ నిర్మాత దిల్రాజు భారీ బడ్జెట్ వెచ్చించిన గేమ్ ఛేంజర్ సినిమా రిలీజ్కు రెడీ అయింది. సంక్రాంతి సందర్భంగా జనవరి 10వ తేదీన ఈ మూవీ విడుదల కానుంది. మెగా పవర్ స్టార్ రామ్చరణ్ హీరోగా నటించిన ఈ చిత్రానికి శంకర్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. అయితే, తెలంగాణలో పరిస్థితి వేరుగా ఉంది. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన తర్వాత.. సినిమాల బెనెఫిట్ షోలకు, టికెట్ల ధరల పెంపునకు అనుమతి ఇవ్వబోమని తెలంగాణ ప్రభుత్వం చెప్పేసింది. అయితే, తనకు ఇంకా ఆశ ఉందని దిల్రాజు తాజాగా అన్నారు. దీనిపై టాలీవుడ్ మొత్తం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. వివరాలివే..తెలంగాణలో టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వబోమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు కదా అని మీడియా సమావేశంలో దిల్రాజుకు ప్రశ్న ఎదురైంది. అయితే, సినిమా రంగానికి ఏం కావాలంటే అది ఇస్తానని స్పీచ్లో రేవంత్ రెడ్డి అన్నారని దిల్రాజు గుర్తు చేశారు. అన్ని ఇస్తామన్నారని, ఇలాంటి ఘటనలు జరగకూడదని అన్నారని తెలిపారు. "అన్నీ ఇస్తానని రేవంత్ రెడ్డి చెప్పారు. నేను ఆ ఆశతో ఉన్నా. మళ్లీ అసెంబ్లీ స్పీచ్ చూడండి. అన్నీ ఇస్తాను అంటున్నారు. అడగలేదంటే.. ఆకలైనా అమ్మ కూడా అన్నం పెట్టదుగా" అని చెప్పారు. ఏపీలో టికెట్ ధరలు పెంచారని.. మీరు కూడా పెంచాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని అడుగుతానని, తుది నిర్ణయం ఆయనదే అని అన్నారు.ఇక సినిమాలకు టికెట్ ధరలు పెంచేదే లేదని తెలంగాణ ప్రభుత్వం ఇటీవల స్పష్టంగా చెప్పేసింది. ఇదేం ముఖ్యమైన విషయం కాదని, పెద్ద అంశాలపై చర్చించామని సీఎంను కలిసి సమయంలో దిల్రాజు చెప్పారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్గా ఉన్న ఆయన అలా అనడంతో.. ఇక టికెట్ ధరల పెంపు ఉండదేమో అని దాదాపు టాలీవుడ్ వర్గాలు ఫిక్స్ అయ్యాయి. అయితే, తాను మళ్లీ సీఎంను అడుగుతానని, గేమ్ ఛేంజర్ మూవీకి టికెట్ ధరల పెంపు ఉంటుందనే ఆశ ఉందని దిల్రాజు తాజాగా చెప్పారు.టికెట్ ధరల పెంపుపై దిల్రాజు నమ్మకంగా ఉండడంపై టాలీవుడ్ మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఒకవేళ గేమ్ ఛేంజర్ మూవీకి టికెట్ ధరలను తెలంగాణ ప్రభుత్వం పెంచితే.. ఇతర సినిమాకు కూడా అవకాశం ఉంటుందని ఇతర నిర్మాతలు ఆలోచిస్తున్నారు. భవిష్యత్తులోనూ టికెట్ రేట్ల పెంపు ఉంటుందని అనుకుంటున్నారు. ఇది తెలుగు ఇండస్ట్రీకి ఊపిరి పీల్చుకున్నట్టుగా ఉంటుందని భావిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డిని దిల్రాజు ఎప్పుడు కలుస్తారో.. టికెట్ ధరల పెంపునకు గ్రీన్ సిగ్నల్ వస్తుందా లేదా అనే ఉత్కంఠ ప్రస్తుతం నెలకొని ఉంది. మరి ఈ విషయంలో ఏం జరుగుతుందో చూడాలి.సంక్రాంతికి విడుదల కానున్న గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం చిత్రాల టికెట్ ధరలు పెంచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే జీవోలు కూడా జారీ చేసింది. గేమ్ ఛేంజర్ మూవీకి మిడ్నైట్ బెనెఫిట్ షోకు కూడా అనుమతి జారీ చేసింది. డాకు మహారాజ్కు జనవరి 12 తెల్లవారు జామున బెనెఫిట్ షోకు ఓకే చెప్పింది. తెలంగాణ ప్రభుత్వంతో దిల్రాజు నెక్స్ట్ మీటింగ్, ఫైనల్ నిర్ణయం కోసం టాలీవుడ్ అంతా నిరీక్షిస్తోంది.

# భారత్ లో హెచ్ఎంపీవీ వైరస్ కలకలం



**న్యూఢిల్లీ, జనవరి 7, పెన్ పవర్:** చైనాలో హెచ్ఎంపీవీ వైరస్ కలకలం సృష్టిస్తోన్న తరుణంలో భారత్ లోనూ ఆ వైరస్ ను గుర్తించడం భయాందోళనలను కలిగిస్తోంది. ఇప్పటికే కర్ణాటకలో రెండు కేసులు నమోదైనట్టు వెల్లడించిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ - ఎఅఓఖీ.. ఇప్పుడు మరికొన్ని రాష్ట్రాల్లో పాజిటివ్ కేసులు నమోదైనట్టు తెలిపింది. ఇంతకుముందు బెంగళూరులో 3, 8 నెలల వయసున్న ఇద్దరు చిన్నారులకు వైరస్ సోకినట్టు కనుగొన్నారు. తాజాగా ఓ గుజరాత్ లోని అహ్మదాబాద్ కు చెందిన చిన్నారికి వ్యాపించినట్టు గుర్తించారు. కోల్కతాలో ఒకరికి పాజిటివ్ నిర్ధారణ అయినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ కీలక ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా శ్వాసకోస వ్యాధుల విషయంలో ఐసీఎంఆర్ సాధారణ పర్యవేక్షణలో భాగంగా రెండు కేసులు వెలుగు చూశాయని చెప్పింది.కర్ణాటకలో రెండు హెచ్ఎంపీవీ (ఊఓఖం - హ్యూమన్ మెటాప్న్యూమోవైరస్) కేసులు నమోదైనట్టు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ధృవీకరించిన గంటల వ్యవధిలోనే , గుజరాత్లో మరో కేసు నమోదైంది. ఇది గుజరాత్లో నమోదైన మొదటి హెచ్ఎంపీవీ కేసు. ఈ వైరస్ సుమారు 2 సంవత్సరాలున్న చిన్నారిలో కనుగొన్నారు. ప్రస్తుతం పేషెంట్ ను అహ్మదాబాద్లోని చంద్ఖేడా ప్రాంతంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. గతంలో కరోనా సమయంలో మొదట ఒకట్రెండు కేసులు నమోదు కాగా, తరువాత విపరీతంగా కేసులు పెరిగి లక్షల మంది చనిపోయారు.ఇక ఇంతకుముందు కర్ణాటకలో నమోదైన రెండు కేసులల్లో ఒకరు మూడేళ్ల బాలికగా.. మరొకరు 8నెలల బాలుడు ఉన్నారు. వీరిద్దరికీ బెంగళూరులోని బాప్టిస్ట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఇద్దరు చిన్నారులూ ఎలాంటి ఇంటర్నేషన్ ట్రిప్ చేయనప్పటికీ.. ఇద్దరికీ బ్రోంకోప్ న్యుమోనియా ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. ఈ ఇద్దరిలో బాలిక ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్టు సమాచారం. ఇక బాలుడు కోలుకుంటున్నాడని చెబుతున్నారు.కేసులు పెరుగుతున్నప్పటికీ దేశంలో కొత్త వైరస్ విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అతుల్ గోయెల్ భరోసా ఇచ్చారు. భయపడాల్సి అవసరం లేదని చెప్పారు. దేశంలో శ్వాసకోస వ్యాధుల ఇన్ఫెక్షన్స్ కు సంబంధించిన కేసులను ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఆస్పత్రుల్లో అవసరానికి మించి సామాగ్రి, పడకలు, ఇతర మెడికల్ సౌకర్యాలు సమకూర్చమన్నారు. హెచ్ఎంపీవీ కూడా సాధారణ శ్వాసకోస వైరస్ ల మాదిరిదేనని చెప్పారు.శీతాకాలంలో సాధారణంగా తలెత్తే శ్వాసకోస లక్షణాలే హెచ్ఎంపీవీకి ఉంటాయని అతుల్ తెలిపారు. దగ్గు, ముక్కు కారటం లేదా గాలి పీల్చుకోవడం కష్టంగా మారడం, గొంతు నొప్పి, జ్వరం వంటి లక్షణాలు ఉండొచ్చన్న ఆయన.. తీవ్రమైన సందర్భాల్లో, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు లేదా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఎక్కువ ఇబ్బంది పడతారని చెప్పారు. సాధారణ లక్షణాలే ఉన్నప్పటికీ తీవ్రంగా అనిపిస్తే వెంటనే సమీపంలోని ఆస్పత్రిని సందర్శించాలని సూచించారు.

# ఫ్రీ వద్దు... రేట్లు పెంచొద్దు

**హైదరాబాద్, జనవరి 7, పెన్ పవర్:**ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఇప్పుడు ఎన్నికల్లో పార్టీలను అధికారంలోకి తెస్తుంది. మొదట ఢిల్లీలో ఆమ్ ఆద్మీపార్టీ ప్రవేశపెట్టి అధికారంలోకి వచ్చింది. తర్వాత తమిళనాడులో డీఎంకే, ఆ తర్వాత కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్, ఈ ఏడాది ఏపీలో టీడీపీ కూటమి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాయి.ఎన్నికల్లో గెలవడానికి, అధికారంలోకి రావడానికి పార్టీలు, నాయకులు అనేక హామీలు ఇస్తుంటారు. ఇందులో ఇప్పుడు ప్రధాన హామీగా మారింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం. ఐదేళ్ల క్రితం ఢిల్లీలోని కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీపార్టీ ఈ హామీని తెరపైకి తెచ్చింది. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత.. మూడేళ్ల క్రితం తమిళనాడు ఎన్నికల్లోనూ ఇదే హామీతో డీఎంకే కూడా అధికారంలోకి వచ్చింది. దీంతో జాతీయ పార్టీ కాంగ్రెస్ కూడా ఈ హామీని అందుకుంది కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో మేనిఫెస్టోలో చేర్చింది. ఇక ఈ ఏడాది ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నేతృత్వంలోని కూటమి కూడా ఇదే హామీతో అధికారంలోకి వచ్చింది. తెలంగాణ, కర్ణాటక, ఢిల్లీ, తమిళనాడులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతోంది. అయితే ఇప్పుడు కర్ణాటక మహిళలు ఈ ఫ్రీ బస్సు మాకొద్దని కోరుతున్నారు. ఫ్రీ బస్సు కారణంగా కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ నష్టాల్లో కూరుకుపోతోంది. దీంతో ఆర్టీసీ చార్జీలు 15 శాతం పెంచాలని సంస్థ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన సార్వత్రిక ఎన్నికలకు ముందు చేసినా.. ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. నాలుగు రోజుల క్రితమే 15 శాతం చార్జీలు పెంచేందుకు అనుమతి ఇచ్చింది. దీంతో బస్సు చార్జీలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు కన్నడ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మహిళల ఉచిత బస్సు ప్రభావంతోనే చార్జీలు పెరిగాయన్న అభిప్రాయం అందరిలో వ్యక్తమవుతోంది.ఫ్రీ బస్ పథకం కర్ణాటక ప్రభుత్వానికి భారంగా మారింది. దీంతో ఆర్టీసీ చార్జీలు పెంచాలని నిర్ణయించింది. నెలకు రూ.400 కోట్లు ఖర్చువుతుండడంతో ఆ భారం ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. ఏడాదిన్నరపాటు భరించిన ప్రభుత్వం ఇప్పుడు చార్జీలు పెంచాలని నిర్ణయించింది. ఆ భారం పురుషులపై వేయడానికి సిద్ధమైంది. నాలుగు రోజుల క్రితం ప్రయాణ చార్జీలు 15 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రోజుకు రూ.8 కోట్ల ఆదాయం వస్తుందని ఆర్టీసీ అంచనా వేసింది. ఈమేరకు అమలు ప్రారంభించింది.చార్జీలు పెంచిన నేపథ్యంలో కర్ణాటక మహిళలు ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు. పురుషులు తమ కుటుంబ సభ్యులే అని పెంచిన చార్జీలతో తమ కుటుంబాలపై భారం పడుతుందని మహిళలు పేర్కొంటున్నారు. చార్జీలు పెంచవద్దని, అవసరమైతే తమ ఉచిత బస్సు ప్రయాణం కూడా రద్దు చేసుకోవాలని కోరుతున్నారు. ఇక ఫ్రీ బస్సు కారణంగా బస్సులు కూడా ఓవర్లోడ్ కారణంగా తరచూ మరమ్మతులకు వస్తున్నాయి. ఇది కూడా ప్రభుత్వానికి భారంగా మారింది. ఈ నేపథ్యంలోనే చార్జీలు పెంచింది. అయితే చార్జీలు తగ్గించాలంటే.. మహిళల ఫ్రీబస్సు రద్దు చేయాలన్న డిమాండ్ కన్నడ ప్రజల నుంచి వస్తోంది.కర్ణాటకలో ఆర్టీసీ చార్జీల పెంపుపై ఆందోళన వ్యక్తమవుతోంది. నిరసనలకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో సిద్ధరామయ్య సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అన్న ఆసక్తి నెలకొంది. ఉచిత బస్సు రద్దు చేస్తుందా.. లేక ఏవైనా సరవణలు చేస్తుందా.. చార్జీలు మినిమంగా వసూలు చేస్తుందా అన్న చర్చ జరుగుతోంది.

# మొదలైన మోడీ గేమ్...

**విజయవాడ, జనవరి 7, పెన్ పవర్::** ఆంధ్రప్రదేశ్ లో నరేంద్ర మోదీ గేమ్ మొదలయినట్లే కనిపిస్తుంది. నరేంద్ర మోదీని ఆషామాషీగా అనుకోవడానికి వీలులేదు. ఆయన దూర దృష్టితో ఆలోచించి ఏ రాజకీయ నిర్ణయమైనా ఉంటుంది. అంతే తప్ప తాత్కాలికంగా ఎటువంటి డెసిషన్లు ఉండవు. అదే సమయంలో మనతో మోదీ అనుకూలంగా ఉన్నారనుకోవడం కూడా అంతే తప్పు అవుతుంది. ఎందుకంటే తనకు ఇబ్బందిగా మారతారనుకున్న వారిని మోదీ కట్టడి చేయడానికే ఎక్కువ ప్రయత్నం చేస్తారన్నది దాదాపు దశాబ్దన్నర జాతీయ రాజకీయాలు చూసిన వారికి ఎవరికైనా ఇలాగే తెలుస్తుంది. మొన్న జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి ఆశించిన స్థాయిలో సీట్లు రాలేదు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఆధారపడాల్సి వచ్చింది. ఆయన పైకి ఇద్దరితో నవ్వుతూ కనిపించినప్పటికీ లోలోపల మాత్రం ఇద్దరినీ రాజకీయంగా కొంత అణిచివేసే ప్రయత్నం చేస్తారన్నది రాజకీయ వర్గాల్లో సాగుతున్న విశ్లే?షణలు బట్టి అర్థమవుతుంది. అందులోనూ చంద్రబాబు లాంటి సీనియర్ నేతను కంట్రోల్ చేయడం మోదీకి అవసరం అని మోదీ ఖచ్చితంగా భావిస్తారు. చంద్రబాబు నిజానికి మోదీ కంటే సీనియర్ నేత. రాజకీయాల్లో మోదీతో పా?టు ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. అయితే అనేకసార్లు బీజేపీతో పొత్తు పెట్టుకోవడం తెగదెంపులు చేసుకోవడం ఆయనకు అలవాటు. నితీష్ కుమార్ కూడా అంతే. అందుకే ఇద్దరు సీనియర్ నేతలను మోదీ నమ్మే అవకాశమే లేదు. అందుకే జమిలి ఎన్నికలకు వెళ్లినా వీరిద్దరి విషయంలో ఒకింత జాగ్రత్త పడతారంటున్నారు. బీహార్, ఆంధ్రప్రదేశ్ లలో ఒకింత ఇద్దరు నేతల గ్రిప్ ను తగ్గించేందుకు మోదీ ప్రయత్నిస్తారన్నది తెలుగుదేశం పార్టీ నేతలు సయితం అనుమానిస్తున్నారు. తనను శాసించే పరిస్థితిని మోదీ తెచ్చుకోరు. తన చేయి పైన ఉండాలని, తనను ఒకరు యాచించాలి తప్ప డిమాండ్ చేయడం మాత్రం ఆయన సహించలేరన్నది మోదీ నైజం తెలిసిన వారు ఎవరైనా ఒప్పుకునే విషయం. అందుకే ఈ ఇద్దరు సీనియర్ నేతలైన నితీష్ కుమార్, చంద్రబాబుల విషయంలో మోదీ ఇప్పటికే స్కెచ్ వేసి ఉంటారన్నది భావిస్తున్నారు. వారిని రాజకీయంగా కొంత బలహీనం చేయగలిగితేనే పది కాలాల పాటు పాలన సాగించవచ్చన్న ఆలోచన సహజంగానే మోదీలో ఉంటుందని చెబుతున్నారు.అందులో భాగంగానే పవన్ కల్యాణ్ ను ఆంధ్రప్రదేశ్ లో హైలెట్ చేయాలని మోదీ భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ కొంతకాలం ఢిల్లీ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే కాకినాడ పోర్టు పైన పడటం కూడా ఒకింత ఢిల్లీ వ్యూహమేనన్న వారు కూడా లేకపోలేదు. అయితే అందులో నిజమెంత? అన్నది పక్కన పెడితే.. చంద్రబాబు గతంలో మాదిరిగా మోదీని డిమాండ్ చేయలేరు. ఎందుకంటే ఏపీలో పవన్ అవసరం చంద్రబాబుకు ఉంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా



మరోసారి పవన్ తో కలసి ప్రయాణం చేస్తేనే అధికారం దక్కుతుంది. ఆ వీక్ నెస్ తోనే పవన్ ను మోదీ మంచి చేసుకుంటున్నారు. వీలయినప్పుడల్లా పవన్ ను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. పవన్ కల్యాణ్ కు ఢిల్లీ స్థాయిలో ఒక రోడ్ మ్యాప్ ను కూడా రూపొందించే అవకాశాలున్నాయి. వచ్చే ఎన్నికల నాటికి పవన్ కల్యాణ్ అత్యధిక స్థానాలను కోరే ఛాన్స్ తో పాటు సీఎం సీటు షేరింగ్ విషయంపై కూడా ఒప్పందం చేసుకోవాలన్న ప్రతిపాదన తీసుకు వచ్చినా ఆశ్చర్యం లేదన్నది రాజకీయవర్గాల అంచనాగా వినిపిస్తుంది. చంద్రబాబు రాజకీయ చాణక్యుడు అయితే.. మోదీ అంతకు మించి. చంద్రబాబు భయం కూడా అదే. మోదీని వదిలి పవన్ బయటకు రారు. అలా ఫిక్స్ చేయడంలో నరేంద్ర మోదీ ఇప్పటికే సక్సెస్ అయినట్లు ఏపీ రాజకీయాలు పరిశీలించిన వారికి ఎవరికైనా అర్థమవుతుంది. మొత్తం మీద దక్షిణాదిలో పట్టు పెంచుకోవాలంటే ఏపీలో గ్రిప్ సంపాదించాలన్న మోదీ ఆలోచనతో పవన్ కు రానున్న కాలంలో మరింత ప్రయారిటీ ఇస్తారన్న అంచనాలు వినపడుతున్నాయి. రేపు ఎనిమిదోతేదీన విశాఖ పర్యటనలో కూడా మోదీ పవన్ కు ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలున్నాయిఅందుకేచంద్రబాబు నాయుడు పెద్దగా రాష్ట్ర ప్రయోజనాల విషయంలో డిమాండ్ చేయలేని పరిస్థితి ఉంది. కూటమితోనే వచ్చే ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనలో ఉన్న చంద్రబాబు ఈసారి మాత్రం పవన్, మోదీలను దూరం చేసుకునే ఆలోచన చేయరు. రాజధాని అమరావతి నిధుల విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వలేదు. కేవలం ప్రపంచ బ్యాంకు రుణం ఇచ్చేందుకు మాత్రమే సహకారం అందించింది. అదే సమయంలో జగన్ విషయంలోనూ ఒకింత మోదీ సాఫ్ట్ కార్నర్ లో ఉన్నారని హస్తిన వర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబును కొంత కట్టడి చేయాలంటే జగన్ ను ఇబ్బంది పెట్టకూడదన్న ఆలోచనలో ఢిల్లీ పెద్దలు ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. అదే జగన్ ధైర్యం అని కూడా అంటున్నారు. ఇటీవల అమిత్ షాతో విజయసాయిరెడ్డి సమావేశం కూడా అందులో భాగమేనంటున్నారు. అలాగే జగన్ కేసుల విషయంలో కూడా ఎటూ తేల్చుకుండా చూసి చంద్రబాబుకు చెక్ పెట్టడమే కమలం పెద్దల ఆలోచనగా ఉందన్న టాక్ కూడా బలంగా వినిపిస్తుంది. మొత్తం మీద కూటమి కలిసి ఉన్నప్పటికీ బలమైన నేతలను బలహీన పర్చే యత్నాలు మాత్రం ప్రారంభమయ్యాయనే అంటున్నారు. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# విశాఖ రైల్వే జోన్.. ఒడిస్సా అభ్యంతరం

**విశాఖపట్టణం, జనవరి 7, పెన్ పవర్::** ఏపీలో కొత్తగా ఏర్పాటు కానున్న రైల్వే డివిజన్‌లో వాల్తేర్ డివిజన్ భాగం కానుంది. వాల్తేర్ రైల్వే డివిజన్‌ను ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ నుంచి వేరు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం ఒడిశాపై తీవ్ర ఆర్థిక పరిణామాలకు దారి తీస్తుందని ఒడిశాలో ప్రధాన ప్రతిపక్షమైన బీజేడీ ఆందోళన వ్యక్తం చేసింది.వాల్తేర్ డివిజన్ విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే జోన్‌లో కలిపే అంశంపై బీజేపీ ప్రభుత్వం మౌనం వహించడాన్ని ఆ పార్టీ ప్రశ్నించింది. రాయగడలో కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటును బీజేడీ స్వాగతించింది.రాయగడలో కొత్త రైల్వే డివిజన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం శంకుస్థాపన చేశారు.ఈస్ట్ కోస్ట్ రైల్వే నుంచి ఆదాయాన్ని ఆర్జించే భాగమైన వాల్తేరు డివిజన్ ను విడ దీయడం కేవలం ఆంధ్రప్రదేశ్ ను ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యమని బీజేడీ నేత బ్రుగు బక్షిపాత్ర ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై వారు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఈసీవోఆర్ పరిధిలో అత్యధిక ఆదాయాన్ని ఆర్జించే డివిజన్లలో వాల్తేరు రైల్వే డివిజన్ ఒకటని పేర్కొన్నారు.డివిజన్ ను విభజించి ఈసీఓఆర్ కు కీలకమైన ఆదాయాన్ని ఆర్జించే భాగాన్ని దక్షిణ కోస్తా రైల్వే జోన్ కు బదలాయించాలన్న నిర్ణయం ఆంధ్రప్రదేశ్ ను, ముఖ్యంగా దాని రాజకీయ నాయకత్వాన్ని ప్రసన్నం చేసుకునే ప్రయత్నం మాత్రమేనని బక్షిపాత్ర విమర్శించారు.దేశంలోనే అతిపెద్ద సరుకు రవాణా ఆదాయం ఆర్జిస్తున్న కొత్తవలస-కిరండూల్ (కేకే) లైన్ సహా 1,052 కిలోమీటర్లకు పైగా రైలు మార్గాలను కవర్ చేసే వాల్తేరు డివిజన్ ఇకపై కొత్త జోన్‌లో భాగం కానుంది.వాల్తేరు డివిజన్‌లో 300 డీజిల్ లోకోమోటివ్‌లను ఉంచే సామర్థ్యంతో భారతీయ రైల్వేలో అతిపెద్ద డీజిల్ లోకో షెడ్ ఉందని, లోడింగ్ లో 75 మిలియన్ టన్నుల మార్కును దాటిన డివిజన్ గా, 2024 మార్చి 31 నాటికి రూ.10,000 కోట్ల ఆదాయాన్ని దాటిన డివిజన్ గా గుర్తింపు ఉంది.వాల్తేరు జోన్ దేశంలోనే అత్యధిక ఆదాయాన్ని ఆర్జించే, సరుకు రవాణా విభాగాల్లో ఒకటిగా నిలిచిందని, రాష్ట్ర రైల్వే మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడానికి ఒడిశా ప్రాంతాలైన జరికెలా, బండముండా, రూర్కెలా, ఝూర్సుగుడా, బెల్పహాడ్, కియోంఝర్, మయూర్భంజ్, బాలాసోర్ జిల్లాలను ఈస్ట్ కోస్ట్



రైల్వేలకు బదిలీ చేయాలని బీజేడీ డిమాండ్ చేసింది.ఈ మార్పు ఒడిశా ప్రయోజనాలను కాపాడుతుందని, రాష్ట్ర ఆర్థిక అవకాశాలను మెరుగు పరుస్తుందని బీజేడీ భావిస్తోంది. రాష్ట్రంలో రైల్వే జోన్లను సమగ్రంగా సమీక్షించాలని డిమాండ్ చేస్తూ, ప్రస్తుతం ఆగ్నేయ రైల్వే పరిధిలో ఉన్న బాలాసోర్, మయూర్భంజ్ మరియు కియోంఝర్ వంటి జిల్లాలను కలిగి ఉన్న ఉత్తర ఒడిశాలో కొత్త డివిజన్ను సృష్టించాలని ఆ పార్టీ ప్రతిపాదించింది.ప్రస్తుతం చక్రధర్పూర్ డివిజన్లో భాగంగా ఉన్న ఝూర్సుగూడ మరియు సుందర్గఢ్లను కలుపుతూ కొత్త రూర్కెలా డివిజన్ను ఏర్పాటు చేయాలని పార్టీ ప్రతిపాదించింది. ఈ చర్యలు ఒడిశాలో మెరుగైన పరిపాలనకు, మెరుగైన రైల్వే సేవలకు దోహదం చేస్తాయని బీజేడీ నేతలు తెలిపారు.వాల్తేరు డివిజన్ ఈసీవోఆర్ నుంచి విడిపోయినప్పుడు బీజేపీ ఎంపీలు మౌనం వహించారని మాజీ ఎంపీ ప్రదీప్ మాఝీ విమర్శించారు.ఒడిశాను ప్రభావితం చేసే కీలక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహిస్తోందని ఆరోపించారు.ఒడిశాలోని మల్కన్ గిరి ప్రాంతంపై ప్రతికూల పరిణామాలు ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ లోని వివాదాస్పద పోలవరం ప్రాజెక్టుకు రూ.12,000 కోట్లు కేటాయించాలని గతంలో నిర్ణయం తీసుకున్నారు.ఆంధ్రప్రదేశ్, బీహార్ లలో రాజకీయ మిత్రపక్షాల ప్రయోజనాలకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న ధోరణిపై బిజెడి అభ్యంతరం చెబుతోంది. 20 మంది లోక్ సభ ఎంపిలతో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి దోహదపడిన ఒడిశాను పక్కన పెట్టడాన్ని బీజేడీ నేతలు తప్పు పడుతున్నారు

# జెండా మోసేదెవరు...

**ఒంగోలు, జనవరి 7, పెన్ పవర్:**బాపట్ల జిల్లాలోని పర్చూరు నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. మొన్నటి ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన ఎన్ఆర్ఐ యడం బాలాజీ నియోజకవర్గంలో లేకుండా అడ్రస్ లేకుండా పొయ్యారు. ఎన్నకల ఫలితాలు వెలువడగానే ఫ్లైట్ ఎక్కేసిన ఆయన అమెరికాలో సొంత వ్యాపారాలు చూసుకుంటూ పార్టీ వ్యవహారాలను పట్టించుకోవడమే మానేశారంట. దాంతోపర్చూరు నియోజకవర్గంలో వైసిపి జెండా మోసే నాయకుడు కరువయ్యాడు.పర్చూరుకు కొత్త ఇన్ఛార్జిని నియమించాలనీ వైసిపి అధిష్టానం చూస్తుందట. ఇప్పటికే పార్టీ ఆవిర్భావం నుంచి నలుగురు ఇన్‌ఛార్జులను మార్చిన వైసీపీ ఈ సారి లోకల్ వ్యక్తులనే నియమించాలని చూస్తుందట. మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి కుమారుడు గాదె మధుసూదన్ రెడ్డిని నియమించాలన్న ఆలోచనలో వైసీపీ అధ్యక్షుడు జగన్ ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇటీవల పులివెందులకు వచ్చిన జగన్ ప్రస్తుత ఇన్చార్జ్‌గా ఉన్న యడం బాలాజీకి కొత్త వారికి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు సమాచారం ఇచ్చారట.గాదే మధుసూదన్ రెడ్డి సొంత ఊరు పర్చూరు నియోజకవర్గంలోని ఇంకొల్లు మండల పరిధిలోకి వస్తుంది .. ఇటు మాజి మంత్రి గాదే వెంకటరెడ్డి పలు సార్లు ఎమ్మెల్యే గా గెలిచిన అనుభవంతో పాటు ఆ కుటుంబానికి నియోజకవర్గంలో సొంత క్యాడర్ కూడా ఉంది.. దాంతో పర్చూరు వైసీపీ బాధ్యతలను గాదే కుటుంబానికి అప్పగించాలని జగన్ ఆలోచిస్తున్నారంట. వైసిపి పార్టీ ఏర్పడినప్పటి నుంచి ఇంతవరకు పర్చూరు నియోజకవర్గంలో బోణి కొట్టలేదు. వరుస ఓటములతో నియోజకవర్గంలో వైసీసీ బలహీనంగా మారిపోయింది.పర్చూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలో టీడీపీ ఏడు సార్లు విజయం సాధించగా కాంగ్రెస్ నాలుగు సార్లు విజయం సాధించింది. వైసీపీ ఆవిర్భావం తర్వాత ఇప్పటివరకు నియోజకవర్గంలో టీడీపీ జెండానే ఎగురుతుంది. ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో విజయం సాధించేందుకు అభ్యర్థులను మార్చి మార్చి ప్రయోగించినా వైసీపీ విజయం సాధించలేకపోయింది. నియోజకవర్గంలో వరుసగా మూడుసార్లు పోటీ చేసిన వైసీపీ ప్రతిసారి ప్రయోగాలతో కొత్తవారిని బరిలోకి దింపినా విజయం సాధించలేకపోయింది. ఎన్నికల సమయంలో వచ్చిన కొత్త నేతను స్థానిక క్యాడర్ వ్యతిరేకించడంతో పాటు సదరు అభ్యర్థికి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను అవగాహన చేసుకునేందుకు సమయం సరిపోయేది. అందుకే నియోజకవర్గంలో ఒక్కసారి కూడా వైసీపీ విజయం సాధించలేకపోయిందన్న అభిప్రాయం ఉంది.ప్రధానంగా నియోజకవర్గంలో బలమైన నేతగా ముద్రపడ్డ టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును వైసీపీ ఎదుర్కోలేకపోయింది. 2014 ఎన్నికల నుంచి మొన్నటి ఎన్నికల దాకా హ్యాట్రిక్ విజయాలతో పర్చూరులో తిరుగులేని నేతగా ఎదిగారు ఏలూరి సాంబశివరావు. 2014 ఎన్నికల్లో తొలిసారి విజయం సాధించిన ఏలూరి సాంబశివరావు ఆ తరువాత సొంత ఇమేజ్ ను పెంచుకుంటూ వచ్చారు. 2019 ఎన్నికల్లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రమంతా ఫ్యాన్ పార్టీ హవా నడిచిన నియోజకవర్గంలో ఏలూరు సాంబశివరావు గెలుపును అడ్డుకోలేకపోయింది. ఆ ఎన్నికల్లో నియోజకవర్గంలో సీనియర్ రాజకీయ నేత దగ్గుబాటి వెంకటేశ్వరరావు పై సాంబశివరావు గెలుపొందారు.

## గోదావరి జిల్లాల్లోబరులు సిద్ధం

**రాజమండ్రి, జనవరి 7, పెన్ పవర్::** రాష్ట్రంలో సంక్రాంతి పండగ అంటే ఫస్ట్ గుర్తొచ్చేది కోడి పందేలు. గతంలో కొన్ని ప్రాంతాలకే పరిమితం అయిన ఈ పందేల కల్చర్.. ఇప్పుడు చాలా జిల్లాలకు పాకింది. ఒకప్పుడు సరదాగా సాగిన కోడి పందేలు.. ఇప్పుడు మంచి బిజినెస్ అయ్యిందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. అందుకే చాలామంది కోళ్లను పెంచడం, వాటిని విక్రయించడం, బరులు నిర్వహించడం ద్వారా కోట్లాది రూపాయలు కూడబెడుతున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి.నిర్వాహకులు కోళ్ల పందెం కట్టినందుకు కొంత, గెలిచిన వారి నుంచి కొంత వాటా తీసుకుంటారు. అంతేకాకుండా బరుల వద్ద సైకిల్, టూవీలర్ పార్కింగ్ నుంచి మద్యం, ఇతర దుకాణదారుల వరకు పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేస్తారు. దీంతో పందేల పేరుతో సామాన్యుల జేబులు గుల్ల చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.అతి తక్కువ రోజుల్లో కోట్లు రూపాయలు కూడబెట్టుకునే అవకాశం ఉండటంతో.. వివిధ జిల్లాల్లో ఈ సంస్కృతి పెరుగుతోంది. పండగ సంప్రదాయం పేరుతో పందేలు నిర్వహిస్తుండటంతో.. ఆపేవారు ఉండరని నిర్వాహకులు భావిస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఇప్పటి నుంచే బరుల ఏర్పాట్లు ప్రారంభించారు. మరోవైపు కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనూ ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి.కోడి పందేలను చూడటానికి, పందేలు కాయడానికి ఏపీలోని ఇతర జిల్లాలతో పాటు.. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి సినీ నటులు, బడా వ్యాపారులు వస్తారు. కేవలం పండగ రోజుల్లోనే కోట్ల రూపాయలు చేతులు మారనున్నాయనే టాక్ ఉంది. ఈ ఏడాది.. 12 నుంచి 15 వరకు నాలుగు రోజులు కోడి పందేల నిర్వహించడానికి ఏర్పాట్లు చకాచకా చేస్తున్నారు.పంట పొలాలను చదును చేసి.. చుట్టూ కంచె వేస్తున్నారు. అక్కడే టెంట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల కోసం మట్టి రోడ్లు వేస్తున్నారు. కోడి పందేలకు వచ్చే వారి కోసం ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. బిర్యానీ, భోజన హోటళ్లు, బెల్ట్ షాపులు ఉండేలా చూసుకుంటున్నారు. వీటిని ఏర్పాటు చేసుకోవాలనుకునే వారి నుంచి కూడా నిర్వాహకులు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు.గతంలో ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పందేలు ఉండేవి. ఇప్పుడు ఇతర జిల్లాల్లోనూ పందేల నిర్వహణకు బరులు సిద్ధం చేస్తున్నారు. దీంతో పందెం కోళ్లకు బాగా డిమాండ్ పెరిగింది. కేవలం సంక్రాంతి కోసమే ప్రత్యేకంగా కోడి పుంజులను పెంచేవారు పెరిగారు. ఒక్కో పుంజు ధర రూ.25 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఉందని పెంపకందారులు చెబుతున్నారు.కోడి పందేలపై గతంలో పోలీసులు సీరియస్ యాక్షన్ తీసుకునేవారు. భోగి పండగకు ముందు వరకు కోడి పందేల నిర్వహణకు వీలు లేదని పోలీసులు స్పష్టం చేశారు. కోళ్లకు కత్తులు కట్టేవారిని బైండోవర్లు చేశారు. కానీ.. కొందరు నేతలు, పెద్దల నుంచి ఒత్తిడి రావడంతో.. పోలీసులు సైలెంట్ అయ్యారనే ప్రచారం జరుగుతోంది. మొత్తానికి ఈసారి ఏపీలో సంక్రాంతి వేరే లెవల్ ఉంటుందనే టాక్ నడుస్తోంది.

## అన్నదాత సుఖీభవ పంపిణీకి ఏర్పాట్లు

**గుంటూరు, జనవరి 7, పెన్ పవర్:** రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ఏపీ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయనుంది. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకంతో కలిపి ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ స్కీమ్ అమలుకు సర్కార్ ప్రయత్నాలు మొదలుపెట్టింది.ఏపీలో కూటమి ప్రభుత్వం...ఎన్నికల హామీల్లో ఒక్కొక్కటి అమలు చేసేందుకు ప్రయత్నిస్తుంది. తాజాగా అన్నదాత సుఖీభవ పథకంపై ప్రభుత్వం అప్డేట్ ఇచ్చింది. కొత్త సంవత్సరంలో రైతులకు శుభవార్త చెప్పింది. రైతుల సంక్షేమానికి సంబంధించిన అన్నదాత సుఖీభవ పథకం అమలుపై ఇటీవల కేబినెట్ లో చర్చించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి మూడు విడతల్లో రూ.6 వేలు ఇస్తుంది. పీఎం కిసాన్ నిధులతో కలిపి రూ.20 వేలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.పీఎం కిసాన్ నిధులు తరహాలో మూడు విడతలుగా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయాలని భావిస్తుంది. ఈ మేరకు కేంద్రం ఒక్కో విడతలో ఎంత మొత్తం నిధులు విడుదల చేస్తుంది, రాష్ట్ర ప్రభుత్వం ఎంత విడుదల చేయాలని విషయాలపై చర్చిస్తుంది. త్వరలోనే అన్నదాత సుఖీభవ విధి విధానాలను ఖరారు చేసి పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే విడుదల చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అర్హత ఉన్న ప్రతిరైతుకు ఏడాదికి రూ. 20వేలు అందిస్తామని కూటమి నేతలు చెబుతున్నారు. ఈ మేరకు ఇటీవల బడ్జెట్ లో అన్నదాత సుఖీభవ పథకానికి రూ. 4,500 కోట్లను కేటాయించారు.అన్నదాత సుఖీభవ నిధులను ఈ ఏడాది మే నెలలో విడుదల చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఇటీవల నరసాపురంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ...అన్నదాత సుఖీభవ పథకంపై కీలక వ్యాఖ్యలు చేశారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారులకు మే నెలలోనే రూ.20 వేలు అందిస్తుందన్నారు.వైసీపీ హయాంలో రైతుభరోసా పేరిట రైతులకు పెట్టుబడి సాయం అందించేవారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరిట కేంద్రం ఏటా అందించే రూ.6 వేలకు మరో రూ.7,500 కలిపి ఏటా రూ.13,500 అందించేవారు. ఎన్నికల హామీల్లో ఈ మొత్తాన్ని రూ.20 వేలకు పెంచుతామని కూటమి పార్టీలు ప్రకటించాయి. కూటమి ప్రభుత్వం ఈ హామీ అమలుపై దృష్టి సారించింది. మూడు విడతల్లో రూ. 20 వేలు సాయం అందించేందుకు ప్రయత్నాలు చేస్తుంది. ఇప్పటికే అన్నదాత సుఖీభవ పేరిట పోర్టల్ ప్రారంభించింది. అన్నదాత సుఖీభవ పథకం కింద పీఎం కిసాన్ నిధులు రూ.6 వేలకు మరో 14 వేలు కలిపి రూ.20 వేలు అందించనున్నారు

## గంజాయిపై ఉక్కుపాదం

**విశాఖపట్టణం, జనవరి 7, పెన్ పవర్:** ఏపీలో గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నారు. గంజాయి తోట కనిపిస్తే కొట్టేయండి లేదా కాల్చేయండి అని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లాసాగు చేస్తున్న 8 ఎకరాల గంజాయి తోటల్ని అధికారులు ధ్వంసం చేశారు. అల్లూరి జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చుతామని పోలీసులు చెబుతున్నారు. ఎక్కడైనా గంజాయి సాగు చేస్తున్నట్లు కనిపించినా, గంజాయి అక్రమ రవాణా గురించి తెలిసినా, డ్రగ్స్ ఉన్నట్లు గుర్తించినా వెంటనే 1972 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. నేరాల నియంత్రణకు డ్రోన్లు, టెక్నాలజీ వినియోగించాలని ఏపీ సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ క్రమంలో పెదబయలు మండలంలోని కంతుర్లకు చేరుకున్న అధికారులు డ్రోన్ల సాయంతో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించారు. గంజాయి సాగు నివారించేందుకు ఏర్పాటు చేసిన ఈగల్ ఐజీ రవికృష్ణ, ఎస్పీ అమిత్ బర్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, అటవీశాఖ అధికారులు పాతపాడు గ్రామంలో 8 ఎకరాల్లో సాగవుతున్న గంజాయి (కానబిస్) తోటను ధ్వంసం చేశారు. జిల్లాలో కొన్ని రోజుల కిందట సైతం డ్రోన్ల ద్వారా పలుచోట్ల గంజాయి సాగు గుర్తించిన అధికారులు తోటల్ని ధ్వంసం చేశారు.ఇది అక్రమ సాగు నియంత్రణ కోసం చేపట్టిన ఆపరేషన్. ఈ ఆపరేషన్లో డ్రోన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సేవలు, o1 టూల్స్ ను ఉపయోగించి ఈ గంజా సాగులను గుర్తించి, వాటిని నాశనం చేయడంలో సహకరించాయని రవికృష్ణ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకూ మొత్తం 2,000 ఎకరాలను డ్రోన్ సర్వే బృందం పర్యవేక్షించింది. డ్రోన్ల ద్వారా గంజాయి సాగును గుర్తించి, గంజాయి తోటల్ని నాశనం చేయడం తమ లక్ష్యమన్నారు. అనంతరం వ్యక్తిగతంగా పాతపాడు గ్రామ ప్రజలతో సమావేశమై గంజాయి సాగువల్ల కలిగే దుష్పరిణామాలు వివరించారు. వీటి కేసులలో ఇరుక్కుని జైలుకు వెళితే జీవితం నాశనం అవుతుందని వారికి నష్టాలపై అవగాహన కల్పించారు.గిరిజనులు చేసే గంజా సాగు వల్ల గ్రామంతో పాటు సమాజం భవిష్యత్తుకు ఏర్పడే హానిని ప్రస్తావించారు. గిరిజనులు, గ్రామస్తులు ఇక నుంచి ఇలాంటి అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనకుండా ప్రతిజ్ఞ చేయించారు. వారికి ప్రత్యామ్నాయ పంటలను అందించడానికి పోలీసులు, రెవెన్యూ, అటవీశాఖలు సాయం చేస్తాయని హామీ ఇచ్చారు. ఈ ఏడాది పాతపాడులో కింగ్ బీన్స్, రాజ్మా, మిల్లెట్ వంటి ప్రత్యామ్నాయ పంటలను అందజేసినట్లు తెలిపారు.అల్లూరి సీతారామరాజు పోలీస్ విభాగం, స్థానిక గ్రామాలతో కలిసి మరింత శాశ్వతమైన, చట్టబద్ధమైన వ్యవసాయ పద్ధతుల వైపు మారేందుకు సహాయం చేస్తామన్నారు. మెరుగైన భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలని వారికి సూచించారు. ఈ ఆపరేషన్ లో భాగంగా ఈగల్ ఐజీ రవి కృష్ణ, ఈగల్ ఎస్పీ నాగేశ్ బాబు, జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, డీఎస్పీ ప్రమోద్, డీఈవో బ్రహ్మాజీరావు, ఫారెస్ట్ అధికారులు, జల్లా పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

# ఆస్ట్రేలియాను ఎలా ఓడించాలో మాకు బాగా తెలుసు..: దక్షిణాఫ్రికా పేసర్




**హైదరాబాద్ పెన్ పవర్:** పదేళ్ల తరువాత బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని గెచుకున్న ఆస్ట్రేలియా.. వరుసగా రెండో సారి డబ్ల్యూటీసీ (%ఔజ%) ఫైనల్ చేరిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జూన్‌లో జరిగే ఫైనల్లో దక్షిణాఫ్రికాతో తలపడనుంది. ఇంగ్లాండ్‌లోని ఐకానిక్ లార్డ్స్ వేదికగా ఇరు జట్లు గద కోసం పోరాడనున్నాయి. ఈ క్రమంలో కమ్మిన్స్ సేనకు సఫారీ పేసర్ రబడా హెచ్చరికలు పంపాడు. ఆస్ట్రేలియాను ఎలా ఓడించాలో తమకు బాగా తెలుసని అన్నాడు."దక్షిణాఫ్రికా %జం% ఆస్ట్రేలియా.. ఇరు జట్ల మధ్య ఎప్పుడూ తీవ్రమైన పోటీ ఉంటుంది. మైదానంలో ఇరు జట్ల ప్లేయర్లు ఒకేలా కష్టపడతారు. మ్యాచ్‌పై పైచేయి సాధించాలన్న కసి ప్రతి సంధర్భంలోనూ కనిపిస్తుంది. వారిపై ఎలా ఒత్తిడి పెంచాలో మాకు తెలుసు.. వారిని ఎలా ఓడించాలో కూడా మాకు తెలుసు.." అని రబాడ అన్నాడు.

దక్షిణాఫ్రికా గత ఏడాదిలో తమ ప్రదర్శనతో అందరినీ ఆశ్చర్యపరిచింది. స్వదేశంలోపాటు విదేశీ సిరీస్‌లను గెలుచుకుంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా ఫైనల్‌కు చేరాలంటే తొలి టెస్టులో పాకిస్థాన్‌ను ఓడించాలి. కానీ, ఏకంగా వైట్ -వాష్ చేసి మన పొరుగు దేశపు జట్టు(పాకిస్థాన్)ను స్వదేశానికి పంపింది. అయితే, కంగారూలను ఓడించడం రబాడ అనుకున్నంత సులభం కాదు. %ఔజ% డిఫెండింగ్ ఛాంపియన్.. ఆసీస్. ఇంగ్లండ్ పిచ్‌లపై వారికున్నంత అవగాహన మరే పర్యాటక జట్టుకు ఉండదు. బ్యాక్-టు-బ్యాక్ టైటిల్స్ గెలిచిన మొదటి జట్టుగా అవతరించే అవకాశాన్ని కంగారూలు అంత ఈజీగా వదిలిపెట్టరు.

రెండు జట్లలోనూ ప్రపంచ స్థాయి పేసర్లు ఉండడంతో డబ్ల్యూటీసీ ఫైనల్ పోరు ఆసక్తికరంగా సాగనుంది. దక్షిణాఫ్రికా బౌలింగ్ విభాగానికి కగిసో రబడా నాయకత్వం వహిస్తుండగా.. ఆసీస్ పేస్ విభాగానికి ఆ జట్టు సారథి పాట్ కమిన్స్ నేతృత్వం వహిస్తున్నాడు.

**అగ్రస్థానంలో సఫారీ జట్టు**

ప్రస్తుతం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(%ఔజ%) సైకిల్‌లో 69.44 శాతం విజయాలతో ప్రొటీస్ జట్టు టేబుల్-టాపర్‌గా కొనసాగుతుండగా.. 63.730 విజయాలతో ఆస్ట్రేలియా రెండవ స్థానంలో ఉంది. ఇక బోర్డర్- గవాస్కర్ ట్రోఫీని 1-3తేడాతో చేజార్చుకున్న టీమిండియా 50 శాతం విజయాలతో మూడో స్థానంలో కొనసాగుతోంది.

# ఇంతకీ మహ్మద్ షమీ ఏమైపోయాడు?: రవిశాస్త్రి

- 2023 వన్డే వరల్డ్ కప్ తర్వాత జట్టుకు దూరమైన షమీ
- గాయంతో బాధపడుతూ ఎన్.సి.ఏలో రిహాబిలిటేషన్
- షమీ ఇప్పుడెక్కడున్నాడు అంటూ రవిశాస్త్రి వ్యాఖ్యలు
- తానైతే షమీని కూడా ఆసీస్ టూర్ కు ఎంపిక చేసేవాడ్నని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాలో అగ్రశ్రేణి పేసర్ గా ఎదిగిన మహ్మద్ షమీ... 2023 వన్డే వరల్డ్ కప్ తర్వాత గాయం బారినపడి పెద్దగా అంతర్జాతీయ క్రికెట్ ఆడలేదు. షమీకి తగిలిన గాయం ఏంటో, అతడు ఎందుకు ఇన్నాళ్లు జట్టుకు దూరంగా ఉన్నాడో స్పష్టత లేదు. షమీ దేశవాళీ క్రికెట్ ఆడుతున్నా, ఫిట్ నెస్ లేదంటూ బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి అతడ్ని పరిగణనలోకి తీసుకోలేదు. దీనిపై టీమిండియా మాజీ కోచ్ రవిశాస్త్రి స్పందించారు. ఇంతకీ షమీ ఏమైపోయాడు అని ప్రశ్నించారు. షమీకి ఏమైందన్న విషయంపై మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని చూసి తాను ఆశ్చర్యపోయానని వెల్లడించారు. షమీ ఎక్కడున్నాడు? గాయం నుంచి కోలుకున్నాడా? జాతీయ క్రికెట్ అకాడమీకి వెళ్లిన షమీ అక్కడ ఎన్ని రోజులు ఉన్నాడు? ఎందుకు షమీ గురించి సరైన సమాచారం బయటికి రావడంలేదు అని రవిశాస్త్రి ప్రశ్నించారు. ఒకవేళ తనకే అధికారం ఉండుంటే, ఆస్ట్రేలియా టూర్ కోసం ఎంపిక చేసిన టీమిండియాలో షమీని కూడా చేర్చేవాడినని అన్నారు. అతడు కోలుకోకపోతే జట్టుతో పాటే ఉంటూ రిహాబిలిటేషన్ జరిగేలా చూసేవాడినని వివరించారు. షమీకి ఎంతో అనుభవం ఉందని, ఆస్ట్రేలియా టూర్ కు అతడ్ని కూడా ఎంపిక చేసి ఉంటే టీమిండియా బౌలింగ్ విభాగం చాలా బలంగా ఉండేదని అభిప్రాయపడ్డారు.

# ఛాంపియన్స్ ట్రోఫీకి వైస్ కెప్టెన్‌గా స్టార్ క్రికెటర్!

- స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు!
- బీసీసీఐ సెలక్టర్లు యోచిస్తున్నట్టుగా కథనాలు
- బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అదరగొట్టిన బుమ్రా
- రెండు మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గానూ రాణించి ఆకట్టుకున్న స్టార్ పేసర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ఆరంభానికి సమయం దగ్గరపడుతోంది. పాకిస్థాన్, దుబాయ్ వేదికగా వచ్చే నెలలో ఈ మెగా టోర్నీ జరగనుంది. భారత జట్టుని బీసీసీఐ సెలక్షన్ కమిటీ మరికొన్ని రోజుల్లోనే ప్రకటించనుంది. జట్టు సారథిగా రోహిత్ శర్మ ఖరారైనట్టు కథనాలు వెలువడుతున్నాయి. అయితే, వైస్ కెప్టెన్‌గా ఎవర్ని ఎంపిక చేస్తారనే ఉత్కంఠ క్రికెట్ వర్గాల్లో నెలకొంది. భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వెన్నునొప్పి గాయం నుంచి కోలుకుంటే వైస్ కెప్టెన్‌గా సెలక్టర్లు ఎంపిక చేస్తారని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పేర్కొంది. పరిమితి ఓవర్ల క్రికెట్‌లో వైస్ కెప్టెన్‌గా బుమ్రాను పరిగణనలోకి తీసుకున్న సందర్భాలు చాలా తక్కువ కావడంతో ఈ తాజా కథనం క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మాజీ కోచ్ రాహుల్ ద్రావిడ్ హయాంలో వన్డే, టీ20 జట్లకు హార్దిక్ పాండ్యా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించేవాడు. కొన్నిసార్లు కేఎల్ రాహుల్ కూడా ఆ బాధ్యతలు నిర్వహించాడు. అయితే, కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టాక వన్డేలు, టీ20లలో వైస్ కెప్టెన్ బాధ్యతలను శుభ్‌మాన్ గిల్‌కు అప్పగిస్తున్నారు. అయితే, ఇటీవల ముగిసిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అద్భుత వ్యక్తిగత ప్రదర్శనతో పాటు రెండు మ్యాచ్‌లకు కెప్టెన్‌గానూ వ్యవహరించి రాణించిన బుమ్రాకు ఛాంపియన్స్ ట్రోఫీలో వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని సెలక్టర్లు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఆస్ట్రేలియాలో భారత్ గెలిచిన ఏకైక టెస్ట్ మ్యాచ్‌కు అతడే సారథిగా వ్యవహరించిన విషయం తెలిసిందే. కాగా, ఆస్ట్రేలియాతో జరిగిన చివరి టెస్టులో గాయపడ్డ జస్ప్రీత్ బుమ్రా ఛాంపియన్స్ ట్రోఫీకి అందుబాటులోకి రావడం దాదాపు ఖాయమే. ఆ సమయానికి కోలుకోనున్నాడు. అయితే ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఫిబ్రవరి 6 నుంచి ఇంగ్లాండ్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు అందుబాటులోకి రావడంపై ఇంకా స్పష్టత రాలేదు.

## సీరత్ కపూర్ స్టైల్ కూడా ఆమెలాగే చాలా మధురంగా ఉంటుంది



# 'గోట్' సినిమా వల్ల డిప్రెషన్‌లోకి వెళ్లా



టాలీవుడ్ లో ఇప్పుడు మంచి డిమాండ్ ఉన్న హీరోయిన్లలో మీనాక్షి చౌదరి ఒకరు. ఓవైపు స్టార్ హీరోల సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు యంగ్ హీరోల సరసన హీరోయిన్ గా చేస్తోంది. గతేడాది అర డజను చిత్రాలతో అలరించిన ఈ బ్యూటీ.. ప్రస్తుతం పలు క్రేజీ ప్రాజెక్ట్స్ లో నటిస్తోంది. ఆమె నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా సంక్రాంతి పండగకు విడుదల కాబోతోంది. ప్రమోషన్స్ లో భాగంగా తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మీనాక్షి మాట్లాడుతూ 'ది గోట్' సినిమా తర్వాత తనపై విపరీతంగా ట్రోల్స్ వచ్చాయని, దాంతో డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాయని తెలిపింది. లేటెస్ట్ ఇంటర్వ్యూలో మీనాక్షి చౌదరి తన జీవితంలోని కష్టమైన అధ్యాయాన్ని పంచుకుంది. తలపతి విజయ్ సరసన హీరోయిన్ గా నటించిన 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' విడుదలైన తర్వాత ఆన్‌లైన్‌లో ఆమెను చాలా ట్రోల్ చేసారని వెల్లడించింది. "గోట్ సినిమాలో నటించిన తర్వాత, నన్ను చాలా మంది ట్రోల్ చేశారు. అవి చూసి ఎంతో బాధపడ్డాను. నేను ఒక వారం పాటు డిప్రెషన్ లోకి వెళ్ళాను. కానీ 'లక్కీ భాస్కర్' చిత్రంతో నాకు మంచి ప్రశంసలు వచ్చాయి. ఇప్పటి నుండి నేను మంచి సినిమాలు చేయడంపైనే దృష్టి పెట్టాలని అప్పుడే గ్రహించాను" అని మీనాక్షి తెలిపింది. వెంకట్ ప్రభు దర్శకత్వంలో విజయ్ ద్విపాత్రాభినయం చేసిన యాక్షన్ థ్రిల్లర్ "ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్"(ది గోట్). ఇందులో మీనాక్షి చౌదరి, స్నేహ, ప్రభుదేవా, ప్రశాంత్, లైలా కీలక పాత్రలు పోషించారు. కథానుగుణంగా సినిమాలో మీనాక్షి పాత్రను విజయ్ పాత్ర చంపేస్తుంది. మీనాక్షి క్యారక్టర్ కు ఎక్కువ స్పేస్ కూడా లేదు. తొలి రోజే మిశ్రమ స్పందన తెచ్చుకున్న ఈ చిత్రం.. విజయ్ స్టార్ పవర్ తో బాక్సాఫీస్ వద్ద గట్టెక్కింది. 440 455.63 కోట్ల వసూళ్లతో 2014లో అత్యధిక కలెక్షన్స్ సాధించిన తమిళ చిత్రంగా నిలిచింది. అయితే ఈ సినిమా తర్వాత తనపై బాగా ట్రోలింగ్ జరిగినట్లుగా మీనాక్షి చెబుతోంది. ఇకపోతే 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో విక్టరీ వెంకటేష్ తో కలిసి నటిస్తోంది మీనాక్షి చౌదరి. ఇదొక ఎక్స్ కాప్, ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, ఎక్సలెంట్ వైఫ్ ల మధ్య జరిగే ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్టైనర్ గా ప్రచారం చేయబడుతోంది. ఇందులో పోలీసాఫీసర్ గా, వెంకీ మాజీ ప్రేయసిగా మీనాక్షి కనిపించనుంది. పోలీస్ క్యారక్టర్ చేయాలనేది తన డ్రీమ్ అని, కెరీర్ తొలినాళ్లలోనే అలాంటి పాత్ర చేసే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందని, ఎంటర్టైనింగ్ గా సాగే కాప్ రోల్ నటించడం కొత్త అనుభూతిని పంచిందని ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకి అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. ఇందులో మీనాక్షితో పాటుగా మరో హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ నటించింది. వెంకటేష్ భార్యగా, నలుగురు పిల్లల తల్లి పాత్రలో ఐశ్వర్య కనిపించనుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషన్స్ కంటెంట్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. సాంగ్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సంక్రాంతికి తప్పకుండా సక్సెస్ సాధిస్తుందని నిర్మాత దిల్ రాజు ధీమాగా ఉన్నారు. 2025 జనవరి 14న తేదీన ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఇక మీనాక్షి చౌదరి ప్రస్తుతం నవీన్ పొలిశెట్టితో కలిసి 'అనగనగ ఒక రాజు' అనే సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే.

## కృతి సనన్ లేటెస్ట్ లుక్ ఫ్యాషన్ హిట్



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com